

# సూర్య
నేటి దినపత్రిక

www.suryaa.com

## ఉత్తరాంధ్ర
విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం

శుక్రవారం 20-2-2026 పేజీలు: 15





# ప్రపంచ స్థాయిలో విశాఖ ప్రతిష్ట

# పెదగంట్యాడలో దారుణం..!!

- మూడేళ్ల చిన్నారిపై కీచకపర్వం
- ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన స్థానికులు
- తల్లిదండ్రుల ఫిర్యాదుతో కేసు నమోదు







## అప్పన్న సన్నిధిలో డీఆర్‌డీఓ చీఫ్

# రోడ్ల కు అడ్డంగా దర్జాగా పార్కింగ్లు..!!



# ప్రపంచ స్థాయి లో విశాఖ ప్రతిష్ట..

⇨ మిలాన్--2026 సిటీ పరేడ్‌లో గవర్నర్ సముద్ర ఐక్యత పిలుపు ⇨ విశాఖను తూర్పు సముద్ర తీర అభివర్ణించిన గవర్నర్ ⇨ అంతర్జాతీయ నౌకలు, విమానాల సమాగమంతో విశాఖకు ప్రతిష్ట ⇨ సైన్యం, నౌకాదళం, వైమానిక దళాల కవాతుతో దేశభక్తి స్ఫూర్తి ⇨ విదేశీ ప్రతినిధుల పాల్గొనికతో బలపడిన స్నేహబంధం ⇨ యువతలో క్రమశిక్షణ, సేవాభావం పెంపొందాలని సందేశం ⇨ సాంస్కృతిక ప్రదర్శనలు -- సైనిక శక్తికి విలువల మేళవింపు ⇨ సముద్రాలు శ్రేయస్సు రహదారులవ్వాలని గవర్నర్ ఆకాంక్ష ⇨ మిలాన్--2026 సిటీ పరేడ్‌లో గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ సందేశం

**(క్రైం బ్యూరో : మేజర్ న్యూస్)**

విశాఖ తీరంలో ఐదు రోజులు గా జరుగుతున్న ఇండియన్ ఫ్లీట్ రివ్యూ లో సముద్ర ఐక్యతకు ప్రతీకగా నిలిచింది. అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూ మరియు ఎక్సర్‌సైజ్ మిలాన్--2026 కార్యక్రమాల్లో భాగంగా రామకృష్ణ బీచ్ ఒడ్డున నిర్వహించిన ఈ మహా వేడుకలో రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ ప్రధానంగా పాల్గొని ఉద్దేశ్యపూర్వక సందేశాన్ని అందించారు. "విశాఖపట్నం కేవలం ఆతిథ్య నగరం మాత్రమే కాదు, ఇది తూర్పు సముద్ర తీరానికి సముద్ర హృదయం" అని గవర్నర్ పేర్కొన్నారు. తరతరాలుగా ఆంధ్రప్రదేశ్ ప్రజలు సముద్రాన్ని శ్రేయస్సు, అవకాశాల ద్వారంగా చూశారని ఆయన గుర్తు చేశారు. ఈ రోజు ప్రపంచ దేశాల నౌకలు, విమానాలు మన తీరంలో నిలవడం సముద్ర భాగస్వామ్యానికి శక్తివంతమైన సంకేతమని చెప్పారు.గత కొన్ని రోజులుగా జరిగిన ఫ్లీట్ రివ్యూ కార్యక్రమాలు ఖండాల నుండి వచ్చిన నౌకలు, ప్రతినిధులను ఒకే వేదికపైకి తెచ్చాయని గవర్నర్ అభినందించారు. సముద్రంపై జరిగిన ఘన సమీక్ష స్ఫూర్తిని ఈ సిటీ పరేడ్ ప్రజల మధ్యకు తీసుకువచ్చిందన్నారు. ఈ సందర్భంగా భారత నౌకాదళం, సైన్యం, వైమానిక దళం, తీరరక్షక దళాల కవాతు బృందాలు క్రమశిక్షణతో చేసిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. విదేశీ నావికాదళ బృందాల పాల్గొనడం దేశాల మధ్య స్నేహం, పరస్పర గౌరవానికి ప్రతీకగా నిలిచిందన్నారు. జాతీయ క్యాడెట్ దళం, సీ క్యాడెట్ కార్ప్స్, పాఠశాల విద్యార్థుల భాగస్వామ్యం దేశ భవిష్యత్తుపై ఆశలు నింపిందని గవర్నర్ పేర్కొన్నారు. "యువతలో క్రమశిక్షణ, సేవాభావం పెంపొందాలి" అని ఆయన ఆకాంక్షించారు. సాంస్కృతిక బృందాల ప్రదర్శనలు భారత నాగరికత వైభవాన్ని ప్రతిబింబించాయని, సైనిక శక్తి వారసత్వం, విలువలతో కలిసినప్పుడే మరింత అర్థవంతమవుతుందని ఆయన చెప్పారు. చీకటి పడుతున్న వేళ లంగరు వేసిన నౌకల వెలుగులు, అనంతరం బాణసంచా, లేజర్, డ్రోన్ ప్రదర్శనలు ఆధునిక భారత ఆవిష్కరణ శక్తిని ప్రపంచానికి చాటాయని వివరించారు. ఆంధ్రప్రదేశ్‌కు భారత నౌకాదళంతో గాఢ బంధం ఉందని గవర్నర్ గుర్తుచేశారు. విశాఖపట్నం ప్రపంచ సముద్ర నగరంగా ఎదుగుతుండడం రాష్ట్ర వ్యూహాత్మక ప్రాధాన్యాన్ని మరింత బలోపేతం చేస్తుందని తెలిపారు. సముద్ర సహకారం వల్లే శాంతి, శ్రేయస్సు సాధ్యమవుతాయని స్పష్టం చేశారు. ఇంతటి భారీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన నౌకాదళం, సాయుధ దళాలు, రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం, సహాయక సంస్థలను గవర్నర్ అభినందించారు. విశాఖ ప్రజల క్రమశిక్షణ, ఆతిథ్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. "విభజనపై సామరస్యం, సంఘర్షణపై సహకారం నిలవాలి. మన సముద్రాలు సురక్షితంగా, బహిరంగంగా ఉండాలి. విశాఖ సముద్ర ఐక్యతకు మార్గదర్శకంగా నిలవాలి" అంటూ ఆయన ప్రసంగాన్ని ముగించారు.

⇨ ఆసియాన్ దేశాలతో రక్షణ బంధం బలోపేతం ⇨ మిలాన్--2026 సందర్భంగా నౌకాదళాధిపతులతో రాజ్ నాథ్ సింగ్ భేటీ ⇨ ఇండో--పసిఫిక్ వ్యూహంలో ఆసియాన్ కీలకం... ⇨ భాగస్వామ్య భద్రతే ప్రాంతీయ శ్రేయస్సుకు పునాది ⇨ 'ఆత్మనిర్భర్ భారత్' రక్షణ సాంకేతికతను వినియోగించుకోవాలని ఆహ్వానం ⇨ 74 దేశాల పాల్గొనికతో మిలాన్ అతిపెద్ద ఎడిషన్ ⇨ సముద్ర దశలో క్లిష్ట యుద్ధ విన్యాసాలు కొనసాగిర్రు ⇨ ఐఎన్ఎస్ విక్రాంత్, విశాఖపట్నం తరగతి నౌకలు భారత్ సామర్థ్యానికి చిహ్నాలు

**(క్రైం బ్యూరో : మేజర్ న్యూస్)**

అంతర్జాతీయ నౌకాదళ విన్యాసాలు మిలాన్--2026 సందర్భంలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ విశాఖపట్నంలో ఆసియాన్ సభ్యదేశాల తొమ్మిది దేశాల నౌకాదళాధిపతులు, ప్రతినిధి బృందాలతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సమావేశం భారత 'యాక్ట్ ఈస్ట్' విధానం, అలాగే 'మహాసాగర్' (భద్రత మరియు వృద్ధి కోసం పరస్పర సమగ్ర అభివృద్ధి) దృక్పథానికి కట్టుబాటును పునరుద్ఘాటించింది. మిలాన్ వ్యాయామం 1995లో నాలుగు విదేశీ నౌకాదళాలతో ప్రారంభమై, 2026లో 74 దేశాల పాల్గొనికతో అతిపెద్ద ఎడిషన్‌గా ఎదిగిందని రక్షణ మంత్రి పేర్కొన్నారు. ఇండియన్ ఓషన్ నేవల్ సింపోజియం (ఐఓఎన్ఎస్), చీఫ్స్ సమావేశం, అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూ--2026 వంటి కార్యక్రమాలు ఇండో--పసిఫిక్ దేశాల మధ్య నమ్మకం, పరస్పర అవగాహన పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. మిలాన్--2026 సముద్ర దశలో సబ్‌మెరిన్ వ్యతిరేక యుద్ధ విన్యాసాలు, వైమానిక రక్షణ, శోధన--రక్షణ కార్యకలాపాలు వంటి క్లిష్ట సముద్ర విన్యాసాలు జరుగుతున్నాయని వివరించారు. ఇండో--పసిఫిక్ వ్యూహంలో ఆసియాన్ దేశాలు కేంద్ర స్తంభమని, భాగస్వామ్య భద్రతే ప్రాంతీయ శ్రేయస్సుకు పునాదని రాజ్ నాథ్ సింగ్ స్పష్టం చేశారు. 'ఆత్మనిర్భర్ భారత్' కార్యక్రమాల ఫలితంగా అభివృద్ధి చెందిన భారత రక్షణ సాంకేతిక పరిజ్ఞాన వ్యవస్థను ఆసియాన్ భాగస్వాములు వినియోగించుకోవాలని ఆహ్వానించారు. ఈ ప్రయత్నాలకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వం వహిస్తున్నారని తెలిపారు. భారత నౌకాదళ మార్పుకు చిహ్నాలుగా నిలిచిన ఐఎన్ఎస్ విక్రాంత్, విశాఖపట్నం తరగతి డిస్ట్రాయర్లను మంత్రి ప్రస్తావిస్తూ, భారత్ 'నిర్మాణ నౌకాదళం'గా ఎదుగుతోందని పేర్కొన్నారు. 2025లో జరిగిన భారత్--ఆసియాన్ అనౌపచారిక సమావేశంలో వ్యక్తమైన అభిప్రాయాలను గుర్తుచేసుకుంటూ, ప్రాంతంలో తొలి స్పందన దేశంగా భారత పాత్రను ఆసియాన్ ప్రతినిధులు ప్రశంసించారని వెల్లడించారు. దీర్ఘకాలిక సముద్ర స్థిరత్వం కోసం యువ నౌకాదళ అధికారుల భాగస్వామ్యంతో ఆసియాన్--ఇండియా రక్షణ ఆలోచనా వేదిక (థింక్ ట్యాంక్) పరస్పర చర్యలను విస్తరించాలని మంత్రి ప్రతిపాదించారు. సమావేశం ముగింపులో స్వేచ్ఛాయుత, బహిరంగ, సమగ్ర ఇండో--పసిఫిక్ లక్ష్యంతో పరస్పర సహకారం కొనసాగించేందుకు ఇరు పక్షాలు కట్టుబాటును వ్యక్తం చేశాయి. 'స్నేహం--సహకారం--సహభాగిత' మిలాన్--2026 అధికారిక సందేశమని మంత్రి పేర్కొన్నారు. ఆసియాన్ దేశాలతో బలపడుతున్న సముద్ర భాగస్వామ్యం -- ఇండో--పసిఫిక్‌లో శాంతి, స్థిరత్వానికి భారత్ కట్టుబాటు అన్నారు.

# పెరేడ్ లో పోలీసు పనితీరు భేష్..

● సీపీ స్వయంగా పరేడ్ మార్గం పరిశీలన ● హోల్డింగ్, కట్-ఆఫ్ పాయింట్ల వద్ద కట్టుదిట్టమైన భద్రత ● కమాండ్ అండ్ కంట్రోల్ నుంచి నిరంతర సీసీటీవీ నిఘా ● డ్రోన్లు, బాడీ వార్న్ కెమెరాలతో సమగ్ర పర్యవేక్షణ ● ట్రాఫిక్ సజావుగా సాగేందుకు ప్రత్యేక చర్యలు ● లక్షలాది ప్రజల మధ్య ప్రశాంతంగా ముగిసిన పరేడ్ ● పోలీస్ సిబ్బందికి సీపీ ప్రత్యేక అభినందనలు



**(క్రైం బ్యూరో : మేజర్ న్యూస్)**

విశాఖ నగరంలో నిర్వహించిన అంతర్జాతీయ సిటీ పరేడ్ విజయవంతంగా సాగేందుకు నగర పోలీస్ యంత్రాంగం సమగ్ర ప్రణాళికతో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టింది. ఈ ఏర్పాట్లను నగర పోలీస్ కమిషనర్ డా. శంఖబ్రత బాగ్చి స్వయంగా పర్యవేక్షించడం విశేషం. పార్క్ హోటల్ నుండి నేవల్ కోస్టల్ బ్యాటరీ వరకు నిర్వహించిన పరేడ్ మార్గమంతా సీపీ స్వయంగా సందర్శించి ట్రాఫిక్, భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ప్రధాన కూడళ్లు, హోల్డింగ్ పాయింట్లు, కట్-ఆఫ్ పాయింట్లు, బీచ్ ఎంక్లోజర్లు, పార్కింగ్ ప్రాంతాలకు వెళ్లి అక్కడ విధుల్లో ఉన్న అధికారులకు స్పష్టమైన సూచనలు జారీ చేశారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రతి అంశాన్ని పర్యవేక్షించారు. సీపీ చొరవతో కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా సీసీటీవీ కెమెరాలు, బాడీ వార్న్ కెమెరాలు, డ్రోన్ నిఘా సమన్వయం చేయబడింది. ట్రాఫిక్ నిర్వహణకు ప్రత్యేక డెస్క్‌లు ఏర్పాటు చేయడంతో పాటు యూ.హెచ్.ఎఫ్ కమ్యూనికేషన్, సోషల్ మీడియా మానిటరింగ్, భద్రతా విభాగాల సమన్వయం సమర్థవంతంగా అమలు చేశారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి కార్యక్రమం సజావుగా సాగేందుకు చర్యలు తీసుకున్నారు. లక్షలాది మంది ప్రజలు హాజరైనప్పటికీ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పరేడ్ ప్రశాంతంగా ముగిసింది. సమగ్ర ప్రణాళిక, సమర్థ నాయకత్వం, నిరంతర పర్యవేక్షణ వల్లే ఇది సాధ్యమైందని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

## - ట్రాఫిక్ సజావుగా సాగేందుకు ప్రత్యేక చర్యలు..

విశాఖ లో అంతర్జాతీయ సిటీ పరేడ్ సందర్భంగా నగరంలో ట్రాఫిక్ సజావుగా కొనసాగేందుకు నగర పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. నగర పోలీస్ కమిషనర్ డా. శంఖబ్రత బాగ్చి స్వయంగా ట్రాఫిక్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ కీలక కూడళ్ల వద్ద పరిస్థితులను సమీక్షించారు. పార్క్ హోటల్ నుండి నేవల్ కోస్టల్ బ్యాటరీ వరకు పరేడ్ మార్గంలో ముందస్తు ట్రాఫిక్ మళ్లింపులు అమలు చేశారు. హోల్డింగ్ పాయింట్లు, కట్-ఆఫ్ పాయింట్లు ఏర్పాటు చేసి వాహన రాకపోకలను దశలవారీగా నియంత్రించారు. బీచ్ ప్రాంతాలకు వచ్చే వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ సౌకర్యాలు కల్పించి, సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా నగరంలోని ప్రధాన రహదారులను సీసీటీవీ కెమెరాలతో పర్యవేక్షించారు. ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక డెస్క్ ఏర్పాటు చేసి, యూ.హెచ్.ఎఫ్ కమ్యూనికేషన్ వ్యవస్థ ద్వారా ఫీల్డ్ సిబ్బందితో నిరంతర సమన్వయం కొనసాగించారు. అవసరమైన చోట్ల అదనపు సిబ్బందిని మోహరించి ట్రాఫిక్ నిలిచిపోకుండా చర్యలు తీసుకున్నారు. ప్రజలకు ముందస్తుగా మార్గమార్పులపై అవగాహన కల్పించేందుకు ప్రకటనలు, సోషల్ మీడియా ద్వారా సమాచారం అందించారు. అత్యవసర వాహనాలకు ప్రత్యేక మార్గాలు కల్పించి ఎటువంటి ఆటంకం లేకుండా ప్రయాణించేలా ఏర్పాట్లు చేశారు. సమగ్ర ప్రణాళిక, సమన్వయం, సాంకేతిక పర్యవేక్షణ ఫలితంగా లక్షలాది మంది పాల్గొన్నప్పటికీ నగరంలో ట్రాఫిక్ సజావుగా కొనసాగింది. ట్రాఫిక్ నిర్వహణలో కృషి చేసిన పోలీస్ అధికారులను సీపీ అభినందించారు.

# రోడ్లకు అడ్డంగా దర్జాగా పార్కింగ్లు..!!

➤ జీవీఎంసీ పరిసర ప్రాంతాలలోనే బహిరంగ కబ్జా ➤ బిర్యానీ పాయింట్ల పేరుతో ఫుట్ పాత్ ల కబ్జా - షాడో నేతల అండదండలతో వ్యాపారాలు ➤ విచ్చలవిడిగా రోడ్ల పైనే పార్కింగ్ లు ➤ ట్రాఫిక్ పోలీసులు ఉన్నా లేనట్లే ➤ అర్ధరాత్రి వరకు అమ్మకాలతో రౌడీలు,గంజాయి బ్యాచ్ ల ఇక్కడే తిష్ట ➤ వీరికి వర్తించని ఆపరేషన్ లాంగ్.2 ➤లఅవినీతి మత్తు లో ట్రాఫిక్ పోలీసులు..!

**(క్రైం బ్యూరో : మేజర్ న్యూస్)**

రాజకీయ అండదండలు ఉంటే చాలు ప్రభుత్వ ఆస్తులను ,భూములను కబ్జాలు చేసేయొచ్చు. చివరికి పాతులు అలాగే పార్కింగ్ స్థలాలను కూడా యదేచ్ఛగా ఆక్రమించవచ్చు. ప్రస్తుతం విశాఖలో ఈ పరిస్థితి కొనసాగుతుంది. జీవీఎంసీ ప్రధాన కార్యాలయం పరిసర ప్రాంతాలలో ఫుట్ పాత్ ఆక్రమణలు మరింతగా పెరిగిపోయాయి. బిర్యానీల పాయింట్ల పేరుతో ఆక్రమణలు చేస్తున్నారు. కూటమి ఎమ్మెల్యేకు చెందిన కొందరు షాడో నేతలుగా వ్యవహరిస్తూ ఇటువంటి వ్యాపారులకు తమ అండదండలు అందిస్తున్నారు. ఆ వ్యాపారులకు ఎటువంటి సమస్యలు లేకుండా చూసుకుంటున్నారు. జీవీఎంసీ ఇటీవల ఆపరేషన్ లాంగ్ 2.0 ప్రారంభించి చాలావరకు ఆక్రమణలు తొలగించడం జరిగింది. కానీ జీవీఎంసీ ప్రధాన కార్యాలయం పరిసర ప్రాంతాలలో ఫుట్ పాత్ లు ఆక్రమణలకు వ్యాపారం పేరిట గురవుతున్న ఎవరు పట్టించుకున్న దాఖలాలు లేవు. ఆపరేషన్ లాంగ్ ఈ వ్యాపారులకు వర్తించవా అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. ఎంత జరుగుతున్న ఏ అధికారి కూడా పట్టించుకోకపోవడంతో జీవీఎంసీ బిర్యానీ దుకాణాల వద్ద రోడ్లు సైతం కబ్జా కబ్జాకు గురయ్యాయి. దీంతో వాహనదారులు పలు అవస్థలు పడుతున్నారు. ట్రాఫిక్ పోలీసుల సహకారంతో రోడ్లు పైనే పార్కింగ్ లకు అనుమతి ఇస్తున్నారంటూ పలువురు ఆరోపణలు చేస్తున్నారు. ఈ ప్రాంతంలో మధ్యాహ్నం, సాయంత్రం నిత్యం రద్దీ తో వాహన దారులు అవస్థలు పడుతున్నారు. ఎమ్మెల్యే షాడో నేతల అండదండలతో ఇక్కడి వ్యాపారులు బరితెగిస్తున్నట్లు కొందరు వ్యాఖ్యానిస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులకు, జీవీఎంసీ,ఫుడ్ హెల్త్ అధికారులకు నెలవారీ మామూళ్లు వెళ్తున్నాయనే ఆరోపణలు కూడా వస్తున్నాయి.

## - ట్రాఫిక్ పోలీసులు ఉన్నా లేనట్లే..?

ఈ ప్రాంతంలో రోజురోజుకీ వాహనాలు ప్రయాణించే సంఖ్య పెరుగుతూ ఉండటంతో ట్రాఫిక్ రద్దీ కూడా పెరుగుతూ వస్తుంది. దీనికి తోడు కొందరు యువకులు అతిగా మద్యం సేవించి అలాగే గంజాయి మత్తులో వాహనాలను అతి వేగంగా నడుపుతూ ప్రమాదాలకు కారణం అవుతున్నారు. గతంలో జరిగిన కొన్ని ప్రమాదాలలో కొందరు గాయపడటం కూడా జరిగింది. అంతేకాకుండా ఇక్కడ రాత్రుల సమయాలలో కొందరు యువకులు బహిరంగంగానే ఫుట్ పాత్ ల మీద డ్రగ్స్ తీసుకుంటున్నారు. అలాగే బైక్ రేసింగ్ నిర్వహిస్తూ స్థానికులను అలాగే ఇతర వాహన దారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. స్థానిక పోలీసులు మాత్రమే కాదు ట్రాఫిక్ పోలీసులు సైతం ఇటు పక్క చూడటం మానేశారు. ట్రాఫిక్ పోలీసుల తీరు అయితే మరి దారుణంగా ఉంది. చలానాలు వేయడం, ఫోటోలు తీయడం మీద ఉన్న శ్రద్ధ ట్రాఫిక్ నియంత్రించడంలోనూ, మద్యం మత్తులో వాహనాలు నడిపే వారిని నియంత్రించడంలో చూపకపోవడం పట్ల విమర్శలు వస్తున్నాయి. కొందరు అతివేగంగా వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు గురవుతున్న తమకు సంబంధమే లేనట్లుగా వ్యవహరిస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు తీరుపై సర్వత్ర విమర్శలు వస్తున్నాయి. ఈ ప్రాంతంలో ప్రతిరోజు రోజు ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతున్న నేపథ్యంలో, త్రీ టౌన్ ట్రాఫిక్ పోలీసులకు పలుమార్లు ఫిర్యాదు చేస్తున్న సదరు ట్రాఫిక్ ఎస్ఐ సైతం ఇక్కడ



సమస్యపై దృష్టి సారించలేదని పలువురు చెబుతున్నారు.

## - చర్యలు తీసుకోవాలి..

ఇక బహిరంగంగా ఫుట్ పాత్ లను సైతం కబ్జా చేసిన జీవీఎంసీ కమిషనర్ తొంగి చూడడం లేదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఇక్కడ వ్యాపారులు నిబంధనలు పాటించకుండా ఇష్టం వచ్చినట్లు తమ వ్యాపారాలు నిర్వహిస్తూ వస్తున్నారు. ఇప్పటికే ప్రాంతంలో మందుబాబులు మద్యం మత్తులో అతి వేగంగా వాహనాలు నడుపుతూ, బైక్ రేసింగ్ స్థానికులకు ఇబ్బందులు కలగ చేస్తున్నారు. ఇక్కడ కొన్ని వ్యాపారాలు అర్ధరాత్రి వరకు కొనసాగుతూ ఉండటంతో రౌడీలు,గంజాయి బ్యాచ్ లు ఇక్కడే తిష్ట వేసుకుని కూర్చుంటున్నారు. అడిగే నాథుడు లేకపోవడంతో ఇక్కడ రాత్రి పగలు యదేచ్ఛగా అమ్మకాలు సాగిస్తున్నారు. మద్యం, బిర్యానీ ఇలా అన్ని రోడ్ల పైనే కానిచ్చేస్తున్నారు. ఈ వ్యాపారం మాటున అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నప్పటికీ అటు పోలీసులు కానీ ఇటు జీవీఎంసీ అధికారులు కానీ ఎవరు కూడా తమకు సంబంధం లేని విషయంగా చూస్తున్నారు. అక్కడ ఏమి జరిగితే మాకెందుకులే అన్నట్లుగా ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు. అధికారుల తీరుపై స్థానికులు మండిపడుతున్నారు. నగర ప్రతిష్టను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తున్న వ్యాపారులపై ఇప్పటికైనా పోలీసులు, జీవీఎంసీ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

# అప్పన్న సన్నిధిలో డి.ఆర్.డి.ఓ చీఫ్..

## - ఘనంగా స్వాగతం పలికిన అధికారులు



**సింహాచలం, ఫిబ్రవరి 19,** భారత రక్షణ పరిశోధన మరియు అభివృద్ధి సంస్థ (డిఆర్.డి.ఓ) చైర్మన్ డాక్టర్ సమీర్ వి. కామత్ గురువారం సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన డాక్టర్ కామత్, దంపతులు లకు ఆలయ ప్రోటోకాల్ పర్యవేక్షణాధికారి ఏ .త్రిమూర్తులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు స్వామివారి దివ్య దర్శనం కల్పించి, వేద ఆశీర్వచనాలు అందజేశారు. దర్శనం అనంతరం ఆలయ మర్యాదల ప్రకారం డాక్టర్ సమీర్ కామత్, దంపతులను శేష వస్త్రంతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు స్వామివారి చిత్రపటాన్ని మరియు ప్రసాదాలను వారికి అందజేశారు.

# నేడు విద్యుత్ అంతరాయం

**అనందపురం, ఫిబ్రవరి 19, మేజర్న్యూస్:** సింహాచలం నాయుడు ఆదేశాల మేరకు33/11 కెవి ఆనందపురం సబ్ స్టేషన్ పరదేశి పాలెం సబ్స్టేషన్ యాడ్ మెట్నెస్ పనుల నిమిత్తం, బోని ఇంట్రెస్ట్ మండల హెడ్ క్వార్టర్ ఫీడర్ మొత్తం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు, ఆనందపురం వేములవలస సత్య కళ్యాణి అపార్ట్మెంట్స్ ఎల్వి పాలెం ఎస్సీ కాలనీ బీపీ కల్లాల రోడ్ బోయిపాలెం గంభీరం ఎస్సీ కాలనీ బీసీ కాలనీ జేఎన్ఆర్ఎం కాలనీ యాతపేట కల్లివానిపాలెం కాపుల ఉప్పాడ తదితర ప్రాంతాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని మండల ఏఈ అప్పమాన్ని తెలిపారు.

# భీమిలిలో ఛత్రపతి శివాజీ జయంతి కార్యక్రమం



**భీమిలి, ఫిబ్రవరి 19, మేజర్న్యూస్:** మిషన్ గ్రీన్ భీమిలి, ఫ్రెండ్స్ అసోసియేషన్ భీమిలి (ఫాబ్) ఆధ్వర్యంలో గురువారం భీమిలి అల్లూరి పార్క్ దగ్గర ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాబ్ ప్రతినిధి ముసునూరి సూర్య శ్రీనివాస్ మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ మహారాజ్ జీవిత కథను రాబోయే తరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని, ఇలాంటి గొప్ప కార్యక్రమానికి ముందుకు వచ్చిన మిషన్ గ్రీన్ భీమిలి ట్రస్టు అధ్యక్షుడు ముమ్మిడిశెట్టి ఆదిత్య మరియు గుల్లల వెంకటేష్ లను అభినందించారు. హిందూ ధర్మ పరిరక్షణ సమితి అధ్యక్షుడు మైలపల్లి షణ్ముఖరావు మాట్లాడుతూ శివాజీ అంటే దేశ భక్తి, హిందూ శక్తి అని అభివర్ణించారు. శివాజీ చరిత్ర నేటి యువతకు స్ఫూర్తిదాయకమని ఆయన చెప్పారు. సాగర్ వాకర్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు కోట మల్లిఖార్జున రావు మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ మహారాజ్ కు భీమిలి ప్రాంతంతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేశారు. దేశానికి క్రూర పాలన నుంచి విముక్తి కల్పించడానికి పోరాడిన యోధుడు శివాజీ అని అన్నారు. మిషన్ గ్రీన్ భీమిలి ట్రస్టు అధ్యక్షుడు ముమ్మిడిశెట్టి ఆదిత్య మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు శివాజీ మహారాజ్ చరిత్రను తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. శివాజీ మహారాజ్ భారతీయ ధర్మాన్ని వ్యాప్తి చేయడం కోసం అవిశ్రాంతంగా పోరాడారని ఆయన చెప్పారు. మన చరిత్రలో దేశ సంపదను కొల్లగొట్టిన ముస్లిం రాజులకు దొరికిన స్థానం, దేశం కోసం పోరాడిన యోధుడు శివాజీ మహారాజ్ లాంటి. వాళ్లకు దొరకకపోవడం దురదృష్టకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో భీమిలి పుర ప్రముఖులు గంటా నూకరాజు, ఫ్రెండ్స్ అసోసియేషన్ భీమిలి (ఫాబ్) సభ్యులు గుగ్గిళ్ళ సాయి, మారోజు గోపి, విజ్జపు సత్యనారాయణ, కట్టమూరి అశోక్ మరియు వాకర్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# సన్ స్కూల్ లో ఘనంగా నిర్వహించిన కిడ్స్ కార్నివాల్

**భీమిలి, ఫిబ్రవరి 19, మేజర్న్యూస్:** సన్ స్కూల్ నందు కిడ్స్ కార్నివాల్ అనే కార్యక్రమము నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సన్ విద్యాసంస్థల కరస్పాండెంట్ కైతపల్లి.శ్రీనివాస్, అధ్యక్షులు, లక్ష్మీ లావణ్య, సొసైటీ సభ్యులు కైతపల్లి భరద్వాజ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కరస్పాండెంట్ కైతపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ చిన్ననాటి నుండే విద్యార్థులు విద్యతోపాటు అన్ని రంగాల్లోనూ అభివృద్ధిని సాధించాలనే ఉద్దేశంతో తమ సంస్థలో ప్రతి సంవత్సరము ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెల్పారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు ప్రదర్శించిన రాణి రుద్రమదేవి, ఛత్రపతి శివాజీ ఏకపాత్రాభినయములు, జానపద నృత్యాలు, సాంప్రదాయ నృత్యాలు,యోగ ప్రదర్శనలు,ఫ్యాషన్ షో మరియు ఇతర కార్యక్రమాలు విద్యార్థులను, తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను ఎంతగానో అలరించాయి. అదేవిధంగా తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించి ప్రత్యేకమైన బహుమతులను అందజేశారు. కార్యక్రమానికి విచ్చేసిన తల్లిదండ్రులకు,విద్యార్థులకు, ఉపాధ్యాయులకు హోటల్ బ్లిస్ యాజమాన్యం వారు అల్పాహారాన్ని అందజేశారు.








## అసెంబ్లీలో చేనేత వస్త్ర ప్రదర్శన

: స్వయంగా వస్త్రాలు కొనుగోలు చేసిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు



**నర్సీపట్నం, ఫిబ్రవరి 19, మేజర్‌న్యూస్:** అమరావతిలోని ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఆవరణలో ఏర్పాటు చేసిన చేనేత వస్త్రాల ప్రదర్శన, విక్రయ కేంద్రాన్ని రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు గురువారం ప్రారంభించారు. ఆప్కో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ స్టాళ్లను ఆయన క్షుణ్ణంగా పరిశీలించి, చేనేత కార్మికులతో ముచ్చటించారు. వారి నైపుణ్యాన్ని అభినందిస్తూ, స్వయంగా పట్టుచీరలు, పట్టు పంచె మరియు షర్ట్‌ను కొనుగోలు చేసి కార్మికుల్లో ఉత్సాహాన్ని నింపారు. దేశవ్యాప్తంగా ఉన్న చేనేత సంఘాలలో మన రాష్ట్రం నుంచే అత్యధికంగా 32 నుండి 33 సంఘాలు ఉండటం గర్వకారణమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ ప్రదర్శనలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల వస్త్రాలన్నీ ఒకే వేదికపై అందుబాటులో ఉన్నాయని, ప్రజలందరికీ మన చేనేత వైభవం తెలియజేసేందుకే ఈ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసినట్లు స్పీకర్ తెలిపారు. నేతన్నలను ఆదుకునేందుకు ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తోందని, మంత్రులు, ఎమ్మెల్యేలు మరియు ఎమ్మెల్సీలు అందరూ ఈ స్టాళ్లను సందర్శించి వస్త్రాలను కొనుగోలు చేయాలని ఆయన కోరారు. బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకు అందుబాటులో ఉండే ఈ స్టాళ్లలో నాణ్యమైన వస్త్రాలపై 40 శాతం వరకు రాయితీ ఇస్తున్నట్లు వెల్లడించారు. ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను ధరించి, కార్మికులను ప్రోత్సహించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రి సవిత, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, కామినేని శ్రీనివాస్, బుచ్చయ్య చౌదరి మరియు ఇతర మంత్రులు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

## అచ్యుతాపురం నుండి కొండకర్ల జంక్షన్ వరకు ఉన్న రోడ్డు గుంతలు లేకుండా బాగు చేయాలి

: సిపిఎం



**అచ్చుతాపురం, ఫిబ్రవరి 19, మేజర్‌న్యూస్:** రోడ్డు విస్తరణలో భాగంగా అచ్యుతాపురం జంక్షన్ నుండి కొండకర్ల వరకు ఉన్న గుంతలను పూడ్చి ప్రయాణికుల ప్రాణాలను కాపాడాలని సిపిఎం అచ్చుతాపురం కన్వీనర్ ఆర్ రాము డిమాండ్. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ రోడ్డులో ప్రయాణించే గర్భిణీలు, వృద్ధులు, ఎస్ ఈ జడ్ కార్మికులు, ఉద్యోగులు నానా అవస్థలు పడుతున్నారు కొత్త రోడ్డు పేరుతో పక్కనే ఉన్న ఈ రోడ్డు గతుకుల మయంగా మారి రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు రోడ్డు కాంట్రాక్టర్ ఇష్టానుసారం వ్యవహరించడం వలన దుమ్ము, ధూళి తో పాటు ఎప్పుడు ఎటువైపు వెళ్ళాలో తెలియక రాత్రులు వెలుతురు లేక అనేక ప్రమాదాలు కు గురవుతున్నారు రోడ్డుపైన దుమ్ము ధూళి రాకుండా నీళ్లు చల్లడం గానీ గోతులు లేకుండా చేయడం వంటి పనులు రోడ్డు కాంట్రాక్టర్ వదిలేశారు వీటిపై ఆర్ అండ్ బి అధికారులు వెంటనే కలుగజేసుకొని ఈ ప్రాంతంలో రాకపోకలు సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సిపిఎం పార్టీ అచ్చుతాపురం మండల కమిటీ డిమాండ్ చేస్తున్నది.

# చీటీలు పేరుతో మోసం

– కోట్లు కాజేసిన ఇద్దరిపై ఫిర్యాదు చేసిన బాధ్యతలు – వీరిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి రిమాండ్కు తరలింపు :ఎస్ఐ సుధాకర్



**అచ్చుతాపురం, ఫిబ్రవరి 19, మేజర్‌న్యూస్:** హరిపాలెం గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు తేదీ 09.2.26న అచ్చుతాపురం పోలీస్ స్టేషన్కు వచ్చి వారు గ్రామంలో వారి వద్ద నుంచి కలగర్ల లతా ఎలియాస్ సౌజన్యలత అలాగే తన భర్త కలగళ్ల శ్రీనివాసరావు మరియు వారి కుటుంబ సభ్యులు కొండకర్ల గ్రామం నుంచి వారి గ్రామానికి సుమారు 15- 20 సంవత్సరాల క్రితం వలస వచ్చి అక్కడ చిట్టీలు అదేవిధంగా డిపాజిట్స్ ప్రజల దగ్గర నుంచి వసూలు చేసినట్లు కొంతవరకు నమ్మకంగా నడిపించి తర్వాత ఎక్కువ మొత్తంలో అమౌంట్ ప్రజల వద్ద నుంచి వసూలు చేసి తర్వాత 2021 -2023 మధ్యలో వాళ్ళు కట్టిన చిట్స్ గాని వాళ్ళ డిపాజిట్ చేసిన మరికొన్ని స్కీమ్స్ కి (గోల్డ్ స్కీమ్ ,సిల్వర్ స్కీమ్)మరి కొన్ని రకాల స్కీమ్స్ కి కలెక్ట్ చేసిన అమౌంట్ 2023 లోనే మెచ్యూరిటీ టైమ్ అయిపోయినా సరే వాళ్లకి ఎవరికి ఇవ్వకున్నా వాళ్ళని మోసం చేసి వారి డబ్బులు మోసగించినట్లుగా రిపోర్ట్ ఇస్తే దానిపై అచ్చుతాపురం పోలీస్ స్టేషన్లో క్రైమ్ నంబరు 50/2026 యు /ఎస్ 318(4) బి ఎన్ ఎస్ 24(1),(2),(3) బడ్స్యక్ట్ కింద కేసు నమోదు చేయడం జరిగింది .దాని తర్వాత దర్యాప్తులో భాగంగా కొంతమంది సాక్షులను విచారించి పిదప నిన్న రాత్రి అనగా 18. 2 .2026 రాత్రి అందులో నిందితులైన ఏ 1 కలగర్ల సౌజన్యలత అలాగే ఏ 2 కలగర్ల శ్రీనివాసరావులను అరెస్ట్ చేయడం జరిగింది వారిని వారి హౌస్ కూడా సెర్చ్ చేయడం జరిగింది. ఈ వివరాలన్నిటి తో పాటు ముద్దాయిలని కోర్టుకు రిమాండ్ నిమిత్తం పంపడం అయినది ఇందులో సాక్షులను మరియు బాధితులను మరికొంత మంది ని విచారించవలసి పూర్తి వివరాలు తెలియపరుస్తామని ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

## న్యాయం కోసం ఆర్డిఓ కార్యాలయంకు పంచదార్ల దళితులు

– బాసట గా వైసీపీ ఎస్సీ సెల్ నాయకులు ఐడి బాబు సురేష్ రాజ్‌లి



**అచ్చుతాపురం, ఫిబ్రవరి 19, మేజర్‌న్యూస్:** రాంబిల్లి మండలం పంచదార్ల దళితులు 1978 వ సంవత్సరం లో దళిత రైతులు ఒక్కొక్కరికి 2 ఎకరాల 75 సెంట్లు చొప్పున సుమారు 50 ఎకరాల కొండా ఫోరం బోకు ను దళితులకు డి ఫామ్ పట్టా గా కేటాయించడం జరిగింది. సదర స్థలంలో నాటి నుండి నేటి వరకు దళితులు మామిడి జీడి మామిడి కొబ్బరి మొక్కలు ఓ ఫ్లస్ మొక్కలు పంపకం చేస్తూ స్థానిక నివాసం ఉంటూ చెవులు సాగిస్తున్నారు రాంబిల్లి తాసిల్దార్ వారు మా యొక్క స్థలాల్లో మేము ఎరీమి లేమని మా స్థలాలను వేరొకరికి కేటాయించడం కోసం మాకు నోటీసులు జారీ చేసి ఉన్నారు సదర నోటీసులకు సమాధానంగా మా దళితులబ్ధిదారుల అంతా కలి నక్కపల్లి ఆర్డిఓ కార్యాలయాలకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐడి బాబు అనకాపల్లి జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పాలశెట్టి సురేష్ రాజ్ విధిసం కార్యదర్శి జి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నక్కపల్లి ఆర్డీవో కి రీ ఆపిల్ చేయడం జరిగింది గత నెలలో తహసిల్దార్ పోస్టు ద్వారా మాకు పంపించినటువంటి నోటీసులు మాకు అందలేదు మాలో ఒకరు ఇద్దరుకు మాత్రమే స్థానిక పోస్మాన్ చేయడం జరిగింది తాసిల్దార్ వారు ఇచ్చిన సవరణ నోటీస్ను మా దళిత సంఘం నాయకులు దళిత లబ్ధిదారులు ఆపిల్ చేయడం జరిగింది కూటమి నాయకులు భూదందాలు వలన పంచదార్ల రైతులకు పోస్ట్ మెన్ ద్వారా నోటీసులు అందలేదు పోస్ట్ మాన్ నుండి స్థానిక మాజీ ఎంపీపీ బన్ను బాబు మా నోటీసులు అందుకోని మేము గ్రామంలో స్థిర నివాసం లేనట్టుగా మా భూముల కొల్లగొట్టాలని ఆపిల్ కి వెళ్లకుండా స్థానిక శాసనసభ్యుడు సుందరపు విజయ్ కుమార్ మరియు కూటమి నాయకులు అడ్డుకట్టు వేస్తున్నారు ఈ రోజు ఐడి బాబు సురేష్ రాజ్ ఆధ్వర్యంలో నక్కపల్లి వల్లి ఆర్డీవో కార్యాలయంలో ఏవో ను కలిసి రీ పిటీషన్ అందించి న్యాయం చేయాలని కోరుతున్నాం ఈ కార్యక్రమంలో స్థానిక దళిత సంఘాలు నాయకులు దళిత పేద రైతులకు న్యాయం చేయాలని లేని పక్షంలో నిరసనలు ధర్నాలతో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో దళిత నాయకులు అబ్బం. అప్పారావు రాజు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## పెద్దమదిన లో తాగునీటి చేతి బోరు ఏర్పాటు చేసిన జడ్పిటిసి దొండా రాంబాబు



**బుచ్చయ్యపేట, ఫిబ్రవరి 19, మేజర్‌న్యూస్:** మండలంలో పెద్ద మదిన గ్రామంలో వ్యవసాయ కల్లాలు దగ్గర తాగునీటి చేతి బోరు ను జడ్పిటిసి దొండా రాంబాబు జిల్లా పరిషత్ నిధులతో ఏర్పాటు చేశారు. ఈ బోరు గురువారం రాష్ట్ర వైసీపీ సంయుక్త కార్యదర్శి, జడ్పిటిసి దొండా రాంబాబు, వైసిపి రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి కొలిమల్ల అచ్చం నాయుడు, బుచ్చయ్యపేట మండల వైసిపి పార్టీ అధ్యక్షులు జోగా కొండబాబు ల తో కలిసి ప్రారంభించారు. వచ్చే వేసవి కాలాన్ని దృష్టిపెట్టుకొని పాడే రైతులకు తాగునీటి ఇబ్బందులు కలకూడదని ఉద్దేశంతో ఈ బోర్ ను స్థానికులు కోరిక మేరకు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, అయితంపూడి వైసిపి గ్రామ యూత్ అధ్యక్షులు ముచ్చకర్ల శివ, బుచ్చయ్యపేట వైసీపీ గ్రామ యూత్ అధ్యక్షులు గాడి శ్రీను మరియు తదితరులు పాల్గొన్నారు.




# అమ్మవారి జాతరకు సర్వం సిద్ధం



**చీపురుపల్లి ఫిబ్రవరి 19 మేజర్ న్యూస్ :** ఉత్తరాంధ్ర కల్పవల్లి చీపురుపల్లి గ్రామ దేవత శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారి జాతరకు సర్వం సిద్ధమైంది. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా భక్తుల పూజలందుకుంటున్న శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారి జాతరకు ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ప్రతి ఏటా జరిగే అమ్మవారి యాత్రకు ఈ ఏడాది నిర్వహించే 28వ జాతర మహోత్సవానికి ఆలయ ప్రాంగణం, చీపురుపల్లి పట్టణాన్ని విద్యుత్ కాంతులతో ముస్తాబు చేశారు. యాత్ర 22 నుంచి 24 వరకు అది, సోమ, మంగళవారం మూడు రోజుల పాటు నిర్వహిస్తారు. ఇందుకు ఆలయ కమిటీ చైర్మన్ గవిడి నాగరాజు, ఈవో నానాజీ బాబు ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. జాతర మహోత్సవంలో సుమారు మూడు లక్షలకు పైగా భక్తులు పాల్గొని అమ్మవారికి పసుపు, కుంకుమ, చీరలు సపర్పించి మొక్కలు చెల్లించుకుంటారని ఆలయ కమిటీ సభ్యులు, అధికారులు అంచనా వేస్తున్నారు. తరలి వచ్చే భక్తుల కోసం తాగునీరు, అత్యవసర వైద్య సేవలు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుంది. జాతర జరిగే మూడురోజులు అమ్మవారు భక్తులకు శోభాయమానంగా దర్శనం ఇవ్వనున్నారు. ఆలయ అర్చక బృందం ఆధ్వర్యంలో కుంకుమ, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.



**పూజా కార్యక్రమాలు :** చీపురుపల్లి గ్రామ దేవత శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారి కి మూడు రోజుల పాటు నిర్వహించే జాతరలో భాగంగా ఆలయ అర్చకులు

ఆరవెల్లి శ్రీనివాసరావు, రవిశర్మ ఆధ్వర్యంలో మూడురోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అందులో భాగంగా ఆదివారం తెల్లవారుజామున రెండు గంటల నుంచే భక్తులు అమ్మవారి దర్శనం కోసం క్యూ లైన్లలో బారులు తీరి మొక్కలు, ముడుపులు చెల్లించుకుంటారు. జాతర ప్రారంభం రోజు 22న ఆదివారం తెల్లవారు ఐదు గంటలకు నేత్రోత్సవం, ఏడు గంటలకు జంగిల్లతో పాలధార ఉత్సవం వైభవంగా నిర్వహిస్తారు. మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఘటాల ఊరేగింపు, ప్రభ సంబరాలు, శోభాయాత్ర



వైభవంగా నిర్వహిస్తారు. కాగా 23న సోమవారం అమ్మవారికి ఉదయం ఎనిమిది గంటల నుంచి కుంకుమ పూజలు నిర్వహిస్తారు. 24న మంగళవారం నాడు కనక మహాలక్ష్మి అమ్మవారికి అక్క చెల్లెలుగా పిలువబడే అసిరితల్లి, బాగిరీతమ్మ, కోటదుర్గ అమ్మవార్లకు భక్తులు పసుపు, కుంకుమలు చెల్లించి పూజలు చేస్తారు. అనంతరం అమ్మవారికి ఘటోత్సవం, శోభాయాత్ర, నృత్య ప్రదర్శనలు చేస్తారు.



**క్యూ లైన్లలో బారికేడ్లు ఏర్పాటు :** శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకోవడం కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక క్యూ లైన్ల కోసం బారికేడ్లు ఏర్పాటు చేశారు. అమ్మవారి దర్శనం కోసం ఉచిత దర్శనంతో పాటు రూ.20, 50, 100 రేట్లతో క్యూలైన్లు, విఐపి ల కోసం ప్రత్యేక లైన్ ఆలయ అధికారులు ఏర్పాటు చేశారు. ప్రభలు కట్టి అమ్మవారి సంబరాల మొక్కలు చెల్లించేవారు నేరుగా అమ్మవారి దర్శనం చేసుకొనే విధంగా చర్యలు తీసుకున్నారు.

**ప్రత్యేక ఆకర్షణలు :** గ్రామ దేవత శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారి యాత్రకోసం ప్రత్యేక ఆకర్షణగా పాలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆలయ కమిటీ నిర్వహిస్తోంది. జాతర జరిగే మూడురోజులు బుర్రకథ, జానపద కళాకారుల గానం, డాన్స్ బేబీ డాన్స్, వివిధ క్రీడా నైపుణ్యాలు ప్రదర్శించనున్నారు. అనంతరం చివరి రోజు రాత్రి భారీ బాణాసంచా కాల్చడంతో అమ్మవారి యాత్ర ముగుస్తోంది.

# ఆస్తి పన్ను మొండి బకాయిదారులకు జప్తు నోటీసులు




**విజయనగరం కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** నగరంలో ఆస్తి పన్ను మొండిబకాయిదారులకు జప్తు నోటీసులను నగర పాలక సంస్థ అధికారులు జారీ చేస్తున్నారు. అసిస్టెంట్ కమిషనర్ కమిషనర్ కిల్లాన అప్పలరాజు ఆధ్వర్యంలో రెవెన్యూ ఇన్ స్పెక్టర్లు అప్పలరాజు సాయిప్రసాద్ వినోద్ కుమార్ చిన్నం నాయుడు ఆస్తి పన్ను వసూళ్లపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ప్రధానంగా వ్యాపార, వాణిజ్య వర్గాల పన్నులను వసూలు చేసేందుకు గురువారం ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా కన్యకా పరమేశ్వర కోవెల నుంచి ప్లకార్డులు ప్రదర్శిస్తూ పన్నులను వసూలు చేశారు. జప్తు వాహనాలను కూడా సిద్ధంగా ఉంచి, దీర్ఘకాల పన్ను బకాయిదారుల దుకాణాలను సీజ్ చేస్తామని అసిస్టెంట్ కమిషనర్ అప్పలరాజు స్పష్టం చేశారు. చాలామంది అక్కడికక్కడే పన్నులను చెల్లించారు.

కొంతమంది చెక్కుల రూపంలో, మరికొందరు డీడీల రూపంలో పన్నులను అందజేశారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను శతశాతం పన్ను వసూలే లక్ష్యంగా తామంత కృషి చేస్తున్నామని చెప్పారు. నగర ప్రజలు కూడా సహకరించి ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్నులు, నీటి చార్జీలు, డి&ఓ ట్రేడ్ లైసెన్స్ ఫీజులు తక్షణమే చెల్లించాలని ఆయన కోరారు.

# చంద్రన్న ఆశయం.. ప్రతి కుటుంబంలో ఆనందం

**- 24మంది బాధితులకు రూ.12.78లక్షల పంపిణీ**

**- ఏపీ మార్క్ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు**





**భోగాపురం, ఫిబ్రవరి 19, మేజర్ న్యూస్ :** ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజల పాలిట ఒక వరం లాంటిదని ఏపీ మార్కెఫెడ్ చైర్మన్, నెల్లిమర్ల తెదేపా ఇంచార్జ్ కర్రోతు బంగార్రాజు అన్నారు. భోగాపురం మండలం పోలిపల్లి గ్రామంలో 24 మంది లబ్దిదారులకు రూ.12.78 లక్షలు విలువ చేసే ముఖ్యమంత్రి సహాయ నిధి నగదు చెక్కులను బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా బంగార్రాజు మాట్లాడుతూ ఆపదలో ఉన్న అనారోగ్య పీడితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఓ వరం లాంటిదన్నారు. అధికారంలోనికి వచ్చిన కొన్ని నెలల్లోనే సీఎంఆర్ఎఫ్ ద్వారా నెల్లిమర్ల నియోజకవర్గంలో వందల సంఖ్యలో బాధితులను గుర్తించి చెక్కులు ఇవ్వడం ఎంతో గర్వించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ, మహంతి శంకర్రావు, పార్లమెంట్ కార్యనిర్వహక కార్యదర్శి నీలాపు అప్పలరామిరెడ్డి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పిన్నింటి సన్యాసినాయుడు, గురాణ చక్రధర్,రాష్ట్ర మత్స్యకార సాధికార సమితి కన్వీనర్ మైలపల్లి సింహాచలం, ఎంపీటీసీ మైలపల్లి తాత, కొమర అశోక్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# ఎన్నికల బూత్ స్థాయి అధికారులతో తహశీల్దార్ సమీక్ష సమావేశం



**బొబ్బిలి, ఫిబ్రవరి 19: మేజర్ న్యూస్ :** బొబ్బిలి రూరల్ పోలింగ్ కేంద్రలకి సంబంధించిన బూత్ స్థాయి అధికారులతో గౌరవ తహసిల్దార్ మరియు సహాయ ఎన్నికల నమోదు అధికారి ఎం.శ్రీను సమీక్ష సమావేశం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 2002 ఐం 2025 ఓటర్ జాభితాలో కామన్ ఓటర్ గా ఉన్న ఓటర్లను మ్యాపింగ్ చేయుటలో 60% శాతం కన్నా తక్కువ ప్రోగ్రెస్ ఉన్న బూత్ స్థాయి అధికారులు అందరూ కూడా హాజరయ్యారు. తహసిల్దార్, సహాయ ఎన్నికల నమోదు అధికారి, బొబ్బిలి వారు మాట్లాడుతూ రానున్న వారం రోజుల్లోగా 60% కన్నా తక్కువ ప్రోగ్రెస్ ఉన్న ప్రతి ఒక్క బూత్ స్థాయి అధికారి ఖచ్చితంగా 60% ప్రోగ్రెస్ దాటవాలేనని, సరిగ్గా వచ్చేవారం ఇదే సమ యానికి రెండవ సమావేశం నిర్వహించబడునని, సదరు సమావేశంలోగా 60% మించి మ్యాపింగ్ ప్రోగ్రెస్ పెంచని బూత్ స్థాయి అధికారులపై క్రమశిక్షణ చర్యలకు ఎన్నికల సంఘం విధి విధానాల ప్రకారం సిఫార్స్ చేయబడినని తెలియజేయడమైనది.

# ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కూటమి పాలన



**నెల్లిమర్ల, ఫిబ్రవరి 19, మేజర్ న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పాలన సాగుతుందని జనసేన సీనియర్ నాయకులు లోకం ప్రసాద్ వెల్లడించారు. నెల్లిమర్ల నగరపంచాయతీ పరిధి జరజాపుపేట 1వ వార్డులో గురువారం చైర్ పర్సన్ బంగారు సరోజినితో ఆయన పర్యటించారు. వార్డులోని సమస్యలను నేరుగా ప్రజలని అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే లోకం నాగ మాధవి మంజూరు చేసిన సీసీ రోడ్ల నిర్మాణ పనులు పురోగతిని అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలని సూచించారు. అలాగే స్థానిక ప్రభుత్వ పాఠశాలను సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. త్వరలో నగరపంచాయతీలో మిగతగా వార్డుల్లో కూడా పర్యటిస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఎఎంసి డైరెక్టర్ ఎంఎం నాయుడు, నగరపంచాయతీ జనసేన యువజన విభాగం అధ్యక్షులు అప్పికొండ రవికుమార్, నాయకులు మద్దిల అప్పన్న, కాళ్ల మహేష్, తుమ్ము వెంకటరమణ పాల్గొన్నారు.

# ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు



**బాడంగి, ఫిబ్రవరి 19, మేజర్ న్యూస్ :** బాడంగి గ్రంథాలయంలో బుధవారం చత్రపతి శివాజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు గ్రంథాలయాధికారి ఆర్.దుర్గా ప్రసాద్, ఆధ్వర్యంలో శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివాజీ ధైర్యసాహసాలతో మరాఠా సామ్రాజ్యాన్ని స్థాపించి, 1674లో రాయ్‌గడ్ కోటలో ఛత్రపతిగా పట్టాభిషేకం పొందారని తెలిపారు. ఆయన ఔరంగజేబు సహా అనేక శక్తులతో పోరాడి గొప్ప యోధుడిగా నిలిచారని కొనియాడారు. శివాజీ వారసత్వాన్ని జ్యోతిరావు పూలే, బాల గంగాధర్ తిలక్ వంటి జాతీయవాదులు ప్రజల్లోకి తీసుకువెళ్లారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పుస్తక పంపిణీ కేంద్రం నిర్వాహకులు గోవిందరావు, గ్రంథాలయ పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పెద గంట్యాడ లో దారుణం..!

● మూడేళ్ల చిన్నారిపై కీచక పర్వం ● చిన్నారి పై మానవ మృగం పంజా ● ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన స్థానికులు ● తల్లిదండ్రులు ఫిర్యాదు తో పోలీసులు కేసు నమోదు ● చిన్నారుల భద్రతపై తల్లిదండ్రుల్లో ఆందోళన

**పెద గంట్యాడ, ఫిబ్రవరి 19, మేజర్‌న్యూస్:** కామాంధులకు కన్నూమిన్నూ కానడం లేదు. వయసుతో పనిలేకుండా, శిశువులని కూడా చూడకుండా పశువుల్లా ప్రవర్తిస్తున్నారు. లోకం తెలియని చిన్నారి బాలికలను సైతం చిదిమేస్తున్నారు. అంతేకాదు.. మరికొందరైతే అఘాయిత్యాలకు పాల్పడ్డాక నిర్దాక్షిణ్యంగా హతమారుస్తున్నారు. ఇటీవల కాలంలో ఇలాంటి ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. నాలుగు రోజుల క్రితం అన్నమయ్య జిల్లా మదనపల్లెలో ఏడేళ్ల చిన్నారిపై ఓ కిరాతకుడు అత్యాచారానికి పాల్పడి హత్య చేసిన ఘటన మరవకముందే తాజాగా విశాఖలోనూ మరో మృగాడు అభం శు భం తెలియని చిన్నారిపై ఘాతుకానికే ఒడిగట్టాడు. న్యూ పోర్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మూడేళ్ల చిన్నారిపై, ఓ యువకుడు అత్యాచారానికి ప్రయత్నించిన ఘటన చోటు చేసుకుంది. చిన్నారి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు పొక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఈనెల 18న బుధవారం పెద్ద గంట్యాడ, గంగవరం, అభినందన సెంటర్ ప్రాంతంలో ఉంటున్న తన స్నేహితుడు అప్పన్నను కలిసేందుకు యెరిపిల్లి యోగి అలియాస్ గాంధీ (19) రావడం జరిగింది. తన స్నేహితుడు భార్య ధనలక్ష్మి ఆ సమయములో ఇంట్లో ఉంది. తన స్నేహితుడు అప్పన్న అప్పటికే బయటకు వెళ్లడం జరిగింది. ఇంట్లో ఉన్న ఆమె మూడేళ్ల కుమార్తెకు బిస్కెట్ల కోసం కిరణా దుకాణానికి తీసుకెళ్తానని చెప్పి చిన్నారిని తనతో పాటు తీసుకెళ్లాడు. వారు కొంత సమయం వరకు తిరిగి రాకపోవడంతో, ఆమె తల్లి తన కుమార్తెను, యోగిని వెతుకుతూ బయటకు రావడం జరిగింది. ఆ కాసేపటి తర్వాత యోగి తన కుమార్తెను ఇంటికి తీసుకువచ్చి వెంటనే అక్కడి నుండి వెళ్లడం జరిగింది. ఆ సమయంలో ఆ చిన్నారి నిరంతరం ఏడుస్తూనే ఉండటం ఆమె గమనించింది. ఆ చిన్నారి బట్టలు తడిగా ఉన్నట్లు గమనించడంతో వెంటనే జాగ్రత్తగా తనిఖీ చేయగా, ఆమె కుమార్తె ప్రైవేటు పార్టు నుంచి రక్తస్రావం అలాగే లోదుస్తులపై రక్తపు మరకలు కనిపించాయి. దీంతో కంగారుపడిన జరిగిన విషయం ఏంటో తెలియక ఆమె తన కూతురికి బట్టలు మార్చి తనను నిదాన పరచడం జరిగింది. అయితే అదే సమయంలో స్థానిక మహిళలు ఆమె ఇంటికి వచ్చి నిందితుడు యోగి ఆ చిన్నారిపై గంగవరంలోని రామాలయం వీధిలోని యెరిపిల్లి కోదండమ్మ ఇంటి సమీపంలోని ఖాళీ స్థలంలో చొరబడి లైంగిక దాడికి పాల్పడ్డాడని సమాచారం ఇచ్చారు. వెంటనే చిన్నారి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగింది.

### - పొక్సో కేసు నమోదు..

న్యూహార్బర్ పోలీస్ స్టేషన్ పరిధిలో యువకుడు యోగి (19) చిన్నారిపై అమానుషంగా ప్రవర్తించిన ఘటన పొక్సో కేసు నమోదు చేసిన పోలీసులు వెంటనే స్పందించి బాధిత చిన్నారిని ఆసుపత్రికి తర లించి చికిత్స అందిస్తున్నారు. హార్బర్ ఏసీపీ చిట్టిబాబు పర్యవేక్షణలో న్యూహార్బర్ పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు సేకరిస్తున్నారు.

### - ఆగని చిన్నారుల ఆక్రందనలు..

బాలికకు భద్రత కరువైంది.అభం శుభం తెలియని చిన్నారులపై అఘాయిత్యాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. పసి మనసులకు పెనుగాయాలు చేస్తున్న సంఘటనలు తరచూ వెలుగు చూస్తున్నాయి. రాష్ట్రంలో తరచుగా ఇటువంటి ఉదంతాలు చోటు చేసుకోవడం కలవరపాటుకు గురి చేస్తున్నది. పసితనంపై పైశాచికత్వం ఏ విధంగా కోరలు చాస్తున్నదో చాటి చెబుతున్నది. నాగరికతకి నిదర్శనంగా చెప్పుకునే భారత సమాజంలో బాలికల ఆక్రందనలు ఆగటంలేదు. బాలికలపై అత్యాచార పర్వాలు కొనసాగుతూనే ఉన్నాయి. చాక్లెట్ కొనిస్తానని ఒకరు, హోలీ ఆడుకునేందుకు రంగులు కొనిస్తానని మరొకరు, మామిడి పండిస్తానని ఇంకొకరు చిన్నారులను నమ్మబలికించి ,అభం శుభం తెలియని పసిమొగ్గల బతుకులను చిదిమేస్తున్నారు. ఇటీవల రాష్ట్రంలో ఇటువంటి సంఘటనలు ఎక్కువ అయ్యాయి. నిర్భయ లాంటి ఎన్ని చట్టాలొచ్చినా బాలికల సంరక్షణ ప్రశ్నార్థకంగానే మిగిలిపోతుంది.

### - ఒకే తరహా ఘటనలు..

ఇటీవల కాలంలో ఒకే తరహా ఘటనలు జరుగుతున్నాయి. చిన్నారులు, బాలికలపై అత్యాచారాలకు దిగుతున్న కామాంధులు ఆ తర్వాత బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం కొప్పుగంటిపాలెంలో సురేష్ అనే యువకుడు జులై 2024లో మైనర్ బాలికపై అసభ్యంగా ప్రవర్తించి హత్య చేశాడు. అనంతరం పోలీసు కేసుల భయంతో నిందితుడు పురుగుల మందు తాగి అత్మహత్య చేసుకున్నాడు. అలాగే 2018లో గుంటూరు జిల్లా దాచేపల్లిలో ఓ మైనర్ బాలికపై సుబ్బయ్య అనే వ్యక్తి అఘాయిత్యానికి ఒడిగట్టాడు. స్థానికులు రోడ్డెక్కి ఆందోళన చేయడంతో సుబ్బయ్య చెట్టుకు ఉరేసుకుని చనిపోపయాడు. ఐదు రోజుల క్రితం అన్నమయ్య జిల్లా మదనపల్లెలో ఏడేళ్ల చిన్నారిపై ఓ కిరాతకుడు అత్యాచారానికి పాల్పడి హత్య చేసి తర్వాత తను కూడా ఆత్మహత్యకు పాల్గొనడం జరిగింది.

### - తల్లిదండ్రుల ఆందోళన..

ఎన్ని చట్టాలు తెచ్చినా బాలికలు, చిన్నారులపై లైంగికదాడులు, లైంగిక దాడి యత్నాలు ఆగడం లేదు. అఘాయిత్యాల నివారణకు పోక్సో చట్టం తెచ్చినా కామాంధుల తీరుమారడం లేదు. జిల్లాలో పోక్సో కేసుల నమోదు సంఖ్య పెరుగుతూనే ఉన్నది. వరుసగా చిన్నారులపై అఘాయిత్యాలు జరుగుతుండడంతో తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవడంలో అలసత్వం వహించడంతోనే ఇలాంటి నేరాలు పెరిగిపోతున్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటువంటి కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

## శాస్త్రోక్తంగా ధ్వజస్తంభ జీర్ణోద్ధరణ పనులు ప్రారంభం



**సింహాచలం, ఫిబ్రవరి 19, మేజర్‌న్యూస్:** శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి వారి ఉపాలయమైన, గంగధార మార్గంలో వెలసియున్న క్షేత్రపాలకులైన శ్రీ బాల సుందరి సహిత త్రిపురాంతక స్వామివారి ఆలయంలో పురాతన ధ్వజస్తంభ జీర్ణోద్ధరణ కార్యక్రమం గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఆదేశానుసారం, వారి పర్యవేక్షణలో ఈ పవిత్ర కార్య క్రమానికి శ్రీకారం చుట్టారు. ధ్వజస్తంభ జీర్ణోద్ధరణలో భాగంగా ఉదయం నుండే ఆలయ అర్చకులు వేద మంత్రోచ్ఛారణల మధ్య విశేష పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా గణపతి పూజ, పుణ్యాహవాచనం మరియు పంచగవ్యం ప్రోక్షణ చేశారు.అనంతరం వాస్తు పూజ, వాస్తు హోమం మరియు జీర్ణోద్ధారనాంగ హోమాలను భక్తిశ్రద్ధలతో పూర్తి చేశారు. కార్యక్రమ ముగింపులో శాస్త్రోక్తంగా పూర్ణాహుతి నిర్వహించి స్వామివారి ఆశీస్సులు అందజేశారు. ఈ పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు వెలవపల్లి వెంకట రమణమూర్తి శర్మ, కాళ్ళకూరి సుబ్రమణ్య శర్మ, సంతోష్ శర్మ, శ్రీ శివాచార్య మరియు ప్రణవ్ శర్మ గారు ఆగమ శాస్త్రం ప్రకారం నిర్వహించారు. సుమారు 20 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపడుతున్న ఈ ధ్వజస్తంభ పునరుద్ధరణ పనులకు ప్రముఖ దాత ఎం.వి. రాఘవ రావు తమ సంపూర్ణ సహకారాన్ని అందించారు. ఆలయ ప్రాచీన వైభవాన్ని కాపాడుతూ, భక్తులకు మరింత ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించేలా ఈ పనులు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమంలో ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి కె తిరుమలేశ్వర్రావు, దేవస్థాన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బండారు రాంబాబు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామరాజు, ఏఈ రవిరాజు పాల్గొని, పురాతన ధ్వజస్తంభ జీర్ణోద్ధరణ పనులను దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది మరియు భక్తులు పాల్గొన్నారు.

## అభిరుచి ఆసక్తి ఉండటం చాలా ప్రధానం




**విశాఖ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 19, మేజర్‌న్యూస్:** వృత్తిపరమైన ప్రగతి సాధించాలంటే సంబంధిత అంశంపై అభిరుచి, ఆసక్తి ఉండటం చాలా ప్రధానమని ట్రాన్స్ ఫార్స్ హేబిట్స్ డైరెక్టర్ ఇంద్రాణి యశోధ కొంపెల్ల అన్నారు. గురువారం ఏయూ సైకాలజీ విభాగలో శతాబ్ది ఉత్సవాలలో భాగంగా నిర్వహించిన అప్లయిడ్ బిహేవియర్ అనాలసిస్ ఇన్ ఆటిజం-ఫౌండేషన్స్ చాలెంజెస్ అండ్ ప్రాక్టీస్ కాంటెక్ట్స్ అంశంపై ప్రసంగించారు . ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత దేశంలో గ్రామీణ ప్రాంతంలో నేటికీ ఆటిజంపై సరైన అవగాహన లేదని, తన వ్యక్తిగత అనుభవాలను ఉదాహరణలతో వివరించారు. అభ్యసనంలో లోపాలు, మానసిక, మనో వైకల్యం కలిగిన వారిని గుర్తించడం ఎంతో అవసరమన్నారు. అప్లయిడ్ బిహేవియర్ అనాలసిస్ (ఏబిఏ) లోని ప్రధానమైన శాస్త్ర విజ్ఞాన్ని తెలుసుకుంటే, విభిన్న దశల్లో దీనిని వినియోగించే అవకాశం ఏర్పడుతుందన్నారు. నేటి తరం కనీసం 30 సెకన్లు సమయం కూడా ఒక అంశంపై కేంద్రీకరించలేకపోతోందన్నారు. ఆటిజం లక్షణాలను వివరిస్తూ, వారి ప్రవర్తనను అర్ధం చేసుకునే ప్రయత్నం చేయాలన్నారు. ఆసక్తి దాయకంగా పలు ఉదాహరణలో ప్రసంగాన్ని అందించారు. అనంతరం విద్యార్థుల సందేహాలకు సమాధానమిచ్చారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎం.వి.ఆర్ రాజు మాట్లాడుతూ జన్యుపరమైన, కాలుష్యం, ఆహార అలవాట్లు, మానసిక అంశాలు సంతానంపై ప్రభావం చూపుతున్నాయన్నారు. ఆరోగ్యకరమైన సంతానం కోరుకునే వారు ఎంతో జాగ్రత్తగా ఈ అంశాలను పరిగణలోనికి తీసుకోవాలని చెప్పారు. భారత దేశంలో వివిధ మనో వైకల్యంతో జన్మించే వారి సంఖ్య గణనీయంగా పెరిగిపోతోందన్నారు. కార్యక్రమంలో విభిగ పరిశోధకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బాబా 29వ ఆలయ వార్షికోత్సవం

### - దర్శించుకున్న బుడుమూరి గోవింద్



**ఆరిలోవ, ఫిబ్రవరి 19, మేజర్‌న్యూస్:** జీవీఎంసీ, 9వ వార్డు హనుమంతువాక లో వెలసియున్న శ్రీ షిరిడీ సాయిబాబా 29 వ ఆలయ వార్షికోత్సవం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ సెల్ అధ్యక్షులు, 9వ వార్డు ఇంచార్జ్ బుడుమూరి గోవింద్ పాల్గొని బాబాను దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ ప్రతి ఏడాది బాబా వార్షికోత్సవం నిర్వహిస్తున్న కమిటీ సభ్యులను గోవింద్ అభినందించారు. అనంతరం స్వామి ప్రత్యేక పూజలో పాల్గొని భక్తులకు స్వామి ప్రసాదాన్ని పంచిపెట్టారు. సాయంత్రం స్వామి వారిని పల్లకి ఊరేగింపు లో గ్రామస్తులు అందరు పాల్గొని స్వామి వారి కీర్తలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం లో ఆలయ కమిటీ సభ్యులు అందరు పాల్గొన్నారు.

## కేజీబీవీ విద్యార్థులకు కిట్లు పంపిణీ చేసిన నాంది ఫౌండేషన్



**పద్మనాభం, ఫిబ్రవరి 19, మేజర్‌న్యూస్:** పద్మనాభం మండలం కస్తూరిబాయి గాంధీ బాలికల విద్యాలయం లో ఆరవ తరగతి నుండి 8వ తరగతి వరకు చదువుతున్న 120 మంది బాలికలకు నాంది ఫౌండేషన్ సౌజన్యంతో బ్యాగులు, పుస్తకాలు,పెన్సిళ్లు, టీషర్ట్స్ షూస్ ఇతర సామాగ్రితో కలిపి ఒక్కొక్కరికి ఒక కిట్ రూపంలో మండల విద్యాశాఖ అధికారులు రమణా మరియు బాబూలాల్ చేతుల మీదుగా అందజేసినట్లు కేజీబీవీ పాఠశాల ప్రిన్సిపాల్ గ్రేస్ లిల్లీ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాంది ఫౌండేషన్ ప్రతినిధి ఝాన్సీ కేజీబీవీ సిబ్బంది పాఠశాల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఫ్యాక్టరీల తనిఖీ అధికారి రాంబాబు

**-ఫ్యాక్టరీల తనిఖీ అధికారి రాంబాబు - 21న భారీ ఎత్తున 'ఆఫ్-సైట్' మాక్ డ్రిల్ నిర్వహణకు సన్నాహాలు- ప్రజలను భాగస్వామ్యం చేస్తేనే డ్రిల్‌కు సార్థకత- ఎన్డీఆర్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ**



రణస్థలం , ఫిబ్రవరి 19, మేజర్ న్యూస్: రసాయన పరిశ్రమల్లో ప్రమాదం సంభవించినప్పుడు క్షణం కూడా వృథా చేయకుండా ప్రాణాలను కాపాడటమే మొదటి ప్రాధాన్యం కావాలనిఫ్యాక్టరీల తనిఖీ అధికారి రాంబాబు అన్నారు. ప్రమాదాలు జరిగేటప్పుడు వివిధ ప్రభుత్వ శాఖలు స్పందించే తీరు, సన్నద్ధత తదితర అంశాలపై ఈనెల 21న పైడి భీమవరం శ్రేయాస్ ఇండస్ట్రీస్ లో నిర్వహించే మాక్ డ్రిల్‌కు ప్రతి రసాయన పరిశ్రమ నుంచి 10 మంది ఫ్రంట్ లైన్ ప్రతినిధులు తప్పనిసరిగా హాజరుకావాలని, విపత్తు నిర్వహణలో నిర్లక్ష్యానికి తావులేదని ఆయన హెచ్చరించారు. ఈ నెల 21న నిర్వహించనున్న 'ఆఫ్-సైట్ ఎమర్జెన్సీ మాక్ డ్రిల్' సన్నాహక సమావేశం గురువారం పైడి భీమవరంలో జరిగింది. రసాయన విపత్తుల సమయంలో అనుసరించాల్సిన ప్రామాణిక నిర్వహణ విధానాలను ఈ సందర్భంగా చర్చించారు. ప్రమాదం జరిగినప్పుడు సమాచారాన్ని వేగంగా చేరవేసేందుకు సైరన్లు, లౌడ్ స్పీకర్లతో పాటు సోషల్ మీడియా వేదికలైన వాట్సాప్, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్‌లను సమర్థవంతంగా వినియోగించుకోవాలని నిర్ణయించారు. అత్యవసర సమయాల్లో ప్రజలకు స్పష్టమైన సందేశాలను మొబైల్ నోటిఫికేషన్ల ద్వారా పంపేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. అనంతరం రెవెన్యూ, పోలీస్, వైద్య ఆరోగ్యశాఖ, ఎన్జీవోలు ఇతర శాఖలు స్పందించాల్సిన, అనుసరించాల్సిన విధివిధానాలపై చర్చించారు. సమన్వయంతోనే విపత్తుల కట్టడి:సమావేశంలో ఎన్డీఆర్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ.. "తాము ప్రాణాలకు తెగించి పోరాడేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉంటాం. అయితే, ఇలాంటి డ్రిల్స్ నిర్వహించేటప్పుడు చుట్టుపక్కల గ్రామాల ప్రజలను పెద్ద ఎత్తున భాగస్వామ్యం చేయాలి. విపత్తు సమయాల్లో ఎలా స్పందించాలో సామాన్యులకు తెలిసినప్పుడే ఈ కసరత్తుకు పూర్తి ఫలితం ఉంటుంది" అని అన్నారు. జిల్లా, రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థల మధ్య నిరంతర సమన్వయం ఉండాలని, పొరుగు జిల్లాల వనరులను కూడా అవసరానికి వాడుకునేలా పరస్పర ఒప్పందాలు ఉండాలని అధికారులు సూచించారు. మున్సిపల్, పోలీస్, ఫైర్, ఆరోగ్య శాఖల అధికారులు సంయుక్తంగా శిక్షణ పొందడం ద్వారా క్షేత్రస్థాయిలో వేగంగా స్పందించవచ్చని అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి మోహన్ రావు, జిల్లా పరిశ్రమల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రఘునాథరావు, శ్రేయస్ హెచ్‌ఆర్, అడ్మిన్ హెడ్ మనోజ్ కుమార్, చీఫ్ సేఫ్టీ ఆఫీసర్ కన్నారావు, ఎన్ఎసిఎల్ సేఫ్టీ హెల్త్ ఎన్విరాన్మెంట్ హెడ్ వెంకటరాజు, అసిస్టెంట్ ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ వంశీ తదితరులు హాజరయ్యారు.

## సమగ్ర శిక్ష అభియాన్ కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలను అసెంబ్లీ లో ప్రస్తావించిన

**- ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్ ఈ ఆర్**



**రణస్థలం, ఫిబ్రవరి 19, మేజర్ న్యూస్:** రాష్ట్రంలో అన్ని మండల విద్యాశాఖ అధికారి కార్యాలయాలలో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న సిబ్బంది అయిన ఎం ఐ ఎస్ కోఆర్డినేటర్లు , డేటా ఎంట్రీ ఆపరేటర్లు మరియు సిఆర్ఎంటి లు మొదలగువారు అప్పటి మన ప్రభుత్వం 2017 లో పెంచిన వేతనమే తప్ప ఎటువంటి వేతన పెంపు లేకుండా విధులు నిర్వహిస్తున్నారు. పెరుగుతున్న ధరలు మరియు జీవన వ్యయాల కారణంగా, వారు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. విద్యాశాఖ పరిపాలనా కార్యకలాపాలలో ఈ కాంట్రాక్ట్ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, వారి సేవలకు తగిన గుర్తింపు, వేతన పెంపు మరియు ఉద్యోగ భద్రత ఇప్పటివరకు కల్పించబడలేదు. ఈ పరిస్థితి వారి ఆర్థిక స్థితిపై ప్రతికూల ప్రభావం చూపుతోంది.కాబట్టి, రాష్ట్ర ప్రభుత్వం మండల విద్యాశాఖ అధికారి కార్యాలయాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ సిబ్బందిని గుర్తించి, వారికి తక్షణమే తగిన వేతన పెంపు కల్పించుటతో పాటు, వారి సేవలను పరిగణనలోకి తీసుకుని ఉద్యోగ భద్రత కల్పించుటకు తగిన చర్యలు తీసుకోవాలని ఈ గౌరవ సభ ద్వారా యువనాయకుడు విద్యారంగం లో సమూల మార్పులకు కృషి చేస్తున్న విద్యాశాఖ మంత్రి వర్యులు నారా లోకేష్ బాబు గారి దృష్టికి తీసుకువస్తున్నానని అన్నారు.

## రణస్థలంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు ఫీజిబిలిటీ కమిటీని నియమించడం



**రణస్థలం, ఫిబ్రవరి 19, మేజర్ న్యూస్** :రణస్థలంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని సురాజ్యభారత్ కన్వీనర్ దుక్క ఆదినారాయణ గత సంవత్సరం నుంచి ప్రభుత్వానికి వినతులు పంపిస్తూ పోరాటం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కాలేజీ ఎడ్యుకేషన్ రీజనల్ డైరెక్టర్ వారు హైయర్ ఎడ్యుకేషన్ కమిషనర్ వారికి ఫీజిబిలిటీ కమిటీ నియమిస్తూ లేఖ రాయడం అభినందనీయమని సురాజ్య భారత్ కన్వీనర్ దుక్క ఆదినారాయణ మరియు కార్యవర్గ సభ్యులు గంట్లాన మారేష్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. రణస్థలం, లావేరు మండలాల నుండి సుమారు 3,000 మంది ఇంటర్మీడియట్ విద్య నుండి విడుదల అవుతున్నారు. వారికి డిగ్రీ చదువుకునే అవకాశం లేకపోవడంతో జిల్లా కేంద్రమైన శ్రీకాకుళం లేదా విజయనగరం వెళ్ళవలసి వస్తుంది. వారు ప్రైవేట్ కాలేజీలో ఫీజులు కట్టలేక, దూర ప్రాంతాల నుంచి కాలేజీకి రాలేక చదువును మధ్యలోనే ఆపేయవలసి వస్తుంది. ముఖ్యంగా బాలికలు డిగ్రీ చదువుకోకుండా ఇంటికే పరిమితం అవుతున్నారు. కాబట్టి రణస్థలం , లావేరు మండలాల విద్యార్థులకు రణస్థలంలో ఏర్పాటు చేయబోయే ప్రభుత్వ డిగ్రీ కళాశాల వలన ఎంతో మందికి మేలు జరుగుతుందని సంతోషం వ్యక్తం చేశారు.

## 13 నుండి జిల్లా స్థాయి రెవెన్యూ క్రీడలు



**పలాస, ఫిబ్రవరి 19, మేజర్ న్యూస్:**శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో ఈ నెల13 నుండి 15 వరకు డిప్యూటీ కలెక్టర్ కేడర్ స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని వాటికి సహకరించాలని పలాస డివిజన్ రెవిన్యూ అసోసియేషన్ అధ్యక్షులు రామారావు మరియు సభ్యులు కోరారు. ఈ మేరకు గురువారం పలాస రెవెన్యూ డివిజనల్ అధికారి జి. వెంకటేష్ కు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీకాకుళంలో నిర్వహించనున్న రెవెన్యూ క్రీడా పోటీలకు సంబంధించి వివరాలు తెలియజేశారు. జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న రెవెన్యూ క్రీడల కార్యక్రమంలో పాల్గొనుటకు పలాస డివిజన్ నుండి అధికారులు మరియు సిబ్బంది పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు డీవీవీఎస్ఎన్ రాజు(ఏపీఆర్ఎస్ఏ సెక్రటరీ)నాయక్ (కోశాధికారి) ఐ.లింగరాజు (స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ)ఆం ".రామారావు (అసోసియేషన్ ప్రెసిడెంట్)పలాస డివిజన్,అప్పలస్వామి(డివిజన్ ప్రెసిడెంట్),పలాస డివిజన్.వి.గిరిరాజు ( సెక్రటరీ,పలాస డివిజన్) పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో జి. వెంకటేష్ మాట్లాడుతూ,క్రీడా పోటీలు స్నేహభావాన్ని మరియు ఐక్యతను పెంపొందించడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.




## మున్సిపల్ ఆదాయం ప్రజల సంక్షేమానికి వినియోగించాలి



**పలాస, ఫిబ్రవరి 19, మేజర్ న్యూస్:**పలాస కాశీబుగ్గ పురపాలక సంఘానికి సంబంధించి మున్సిపల్ యాక్ట్ 1965 ప్రకారం మున్సిపల్ ఆదాయాన్ని పురపాలక సంఘ ప్రజల సంక్షేమం కోసం వినియోగించాలని పలాస మాజీ పిఎసిఎస్ అధ్యక్షుడు దువ్వాడ శ్రీధర్ బాబా కోరారు. ఈ సందర్భంగా స్థానిక శివాజీ నగర్ లో గల ఆయన స్వగృహంలో గురువారం మాట్లాడుతూ పురపాలక సంఘంలో 31 వార్డులు ఉన్నాయని,ఆ వార్డులలో సుమారు లక్ష 30 వేల మంది ప్రజలు నివసిస్తున్నారని అన్నారు. 17 వేలకు పైబడి ఉన్న ఇళ్ళకు ఇంటి పన్నులు వసూలు చేయబడుతుందని అన్నారు. 2026 మార్చి 31 నాటికి ఇంటి పన్ను ద్వారా సుమారు ఎనిమిది కోట్ల రూపాయల ఆదాయం వస్తుందని, ప్రతి ఏడాది మున్సిపల్ యాక్ట్ 1965 ప్రకారం15 శాతం ఆస్తి పన్ను ఆటోమేటిక్ పెంపు జరుగుతోందని అన్నారు. 2027 మార్చి 31 నాటికి ఈ పెంపు వల్ల ఎనిమిది కోట్ల నుండి 9 కోట్ల 20 లక్షల రూపాయల వరకు పెరుగుతుందని అంటే ప్రతి ఏడాది ప్రజలపై పన్ను భారం పెరుగుతూనే ఉందని అన్నారు ఇంత భారీ ఆదాయం వస్తున్న సందర్భంలో ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు ఎందుకు అందడం లేదన్నది పురపాలక ప్రజలు ఆవేదన చెందుతున్నారని ఇది మున్సిపల్ కమిషనర్ గుర్తించాలని కోరారు. మున్సిపాలిటీలో సుమారు 80 మంది పారిశుద్ధ్య కార్మికులు ఉన్నట్లు సమాచారం ఉందని, 17వేల ఇళ్లకు 80 మంది పారిశుద్ధ్య కార్మికులతో పారిశుద్ధ్య నిర్వహణ ఎలా సాధ్యపడుతుందని ఆయన ప్రశ్నించారు. లక్ష 30 వేల జనాభాకు కనీసం 160 మంది పారిశుద్ధ్య కార్మికులు అవసరమని,సిబ్బంది పెంపుపై స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని,పారిశుద్ధ్య కార్మికుల పీఎఫ్ బకాయిలు వెంటనే చెల్లించాలని చెల్లించాలని,ఇవి రాజకీయ అంశాలు కావని,ప్రజల ప్రాథమిక హక్కులని,వీటిపై మున్సిపల్ కమిషనర్ స్పష్టమైన సమాధానం ప్రజలకు తెలపాల్సిన అవసరం ఉందని దువ్వాడ శ్రీధర్ (బాబా) స్పష్టం చేశారు

## పాతపట్నం ఆదివాసీల పై ఆర్టీసీ నిర్లక్ష్య



**కొత్తూరు ఫిబ్రవరి 19(మేజర్ న్యూస్ ):** పాతపట్నం నియోజకవర్గం లో గల ఆదివాసీ గిరిజనుల పై జిల్లా ప్రజా రవాణా శాఖ (ఆర్టీసీ )నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తోందని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సిర్ల ప్రసాదరావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఈ నియోజకవర్గం పరిధి కొత్తూరు మండలం లో మారుమూల గిరిజన ప్రాంతాలకు ఉన్న బస్ సౌకర్యం గత మూడు సంవత్సరాలనుండి నిలిపి వేశారని, గిరిజనులు ఎన్ని విజ్ఞప్తులు చేసిన ప్రజా రవాణా శాఖ (ఆర్టీసీ ) అధికార్లు పట్టించుకోలేదని సిర్ల ఆరోపించారు. మారుమూల ప్రాంతాల గిరిజనులు మండల , జిల్లా కేంద్రాలకు వెళ్లాలంటే ఆటోలు , ప్రైవేట్ ఆపరేటివ్ దోపిడీ కి గురౌతున్నారని ఆయన అన్నారు. ఆదివాసీ గిరిజనుల పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని అన్నారు. బగ్గ మర్రిపాడు, గొట్టిపల్లి తదితర ప్రాంతాలలో గతం లో , రద్దు బస్సు సర్వీసులు తిరిగి పునరుద్ధరించాలని కోరుతున్నా సంబంధిత శాసన సభ్యులు , జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారులు పట్టించు కోవడం లేదని , ఈ ప్రాంతంలో నివసిస్తున్న గిరిజనులు ఆంధ్రప్రదేశ్ వాసులు కారా అని ప్రశ్నించారు. రాష్టం లో అమలు చేసిన స్త్రీ శక్తి పథకం ఆదివాసీ గిరిజనులకు వర్తించడం లేదని అన్నారు. కొత్తూరు-గొట్టిపల్లి , పూతిక వలస -హడ్డుబంగి , ఆర్ కే పురం పాలకొండ , కొత్తూరు - టెక్కలి ,శ్రీకాకుళం -కడుము ప్రాంతాలకు బస్సు సర్వీసులు పునరుద్ధరణ చేయాలని డిమాండ్ చేశారు. తమ అవసరాలు మండల కేంద్రానికి వెళ్లాలంటే నరకయాతన అనుభవిస్తున్నారని అన్నారు. రద్దు చేసిన బస్ సర్వీసులు తిరిగి పునరుద్ధరణ చేస్తే గిరిజనులు తో సహా గిరిజనేతరులకు ఎంతో ఉప యోగపడుతుందని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం లోనికి వచ్చి రెండేళ్లు దాటినా టెక్కలి డివిజనల్ కేంద్రానికి బస్సు సౌకర్యం కల్పించడం లో పాలకులు , జిల్లా అధికారులు నిర్లక్ష్య వైఖరి అవలంభించడం అన్యాయం అని అన్నారు.




## ఓటర్ల జాబితా తయారీపై సమావేశ నిర్వహించిన డిప్యూటీ ఎంపీడీవో కేకే వర్మ



**సీతానగరం ఫిబ్రవరి 19 మేజర్ న్యూస్ :** పంచాయతీ అభివృద్ధి అధికారులతో రాబోయే పంచాయతీ ఎన్నికల కొరకు ఓటర్ల జాబితా తయారీపై డిప్యూటీ ఎంపీడీవో కేకే వర్మ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించడం జరిగినది. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ గ్రామ ముస్తాబు కార్యక్రమం ప్రతి గ్రామంలో నిర్వహించుటకు ప్రతి పంచాయతీలో ముందుగా విజువల్లి క్లినింగ్ చేపట్టుటకు పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని పంచాయతీ రాజ్ కమిషనర్ జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు ఇంటి పన్నులు లైసెన్స్ ఫీజులు వసూలు చేయు లక్ష్యాలను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించడమైనది. ఈ సమావేశంలో పంచాయతీ అభివృద్ధి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పాలకొండ పట్టణ అభివృద్ధికి మంత్రి నారాయణ హామీ



**పాలకొండ, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో మున్సిపల్ శాఖ మంత్రి నారాయణను పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ నేతృత్వంలో నగర పంచాయతీ కౌన్సిలర్ కొంచాడ అరుణ్ కుమార్ మరియు జనసేన నాయకులు కొండదాడి రాజేష్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పాలకొండ పట్టణంలోని ప్రధాన సమస్యలపై మంత్రికి వినతి పత్రం అందజేశారు. ముఖ్యంగా పట్టణంలో దీర్ఘకాలంగా వేధిస్తున్న డంపింగ్ యార్డ్ సమస్యను పరిష్కరించాలని మరియు ట్రాఫిక్ ఇబ్బందుల దృష్ట్యా రోడ్ల వైండింగ్ పనులు చేపట్టాలని కోరారు. ఈ సమస్యలపై సానుకూలంగా స్పందించిన మంత్రి నారాయణ, పాలకొండ పట్టణ అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## నల్ల బ్యాచ్‌లతో నిరసన తెలియజేసిన విఆర్ఓ, వీఆర్ఏ, విఎస్‌లు



**సీతానగరం ఫిబ్రవరి 19 మేజర్ న్యూస్ :** పని ఒత్తిడి తగ్గించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా నిరసనలో భాగంగా స్థానిక తాసిల్దార్ కార్యాలయం ఎదుట వీఆర్వోలు. వీఆర్ఏ విఎస్‌లు నల్ల బ్యాచ్ లతో గురువారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు ఈ సందర్భంగా వీఆర్వోల సంఘం నాయకులు పి కుమార్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్త సంఘం పిలుపుమేరకు నిరసన కార్యక్రమాన్ని చేపట్టామని కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అనేక పనుల ఒత్తిడి పెంచిందని దీనితో మానసికగా ఇబ్బందులు పడుతున్నామని ఈ సమస్యలపై సంఘం పిలుపుమేరకు కార్యక్రమాన్ని చేపట్టామన్నారు ప్రభుత్వం సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు ఎం.సింహాచలం సత్యనారాయణతో పాటు వివిధ గ్రామాల వీఆర్వో గ్రామ విఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యోగి వేమన జయంతి



**పాలకొండ, మేజర్ న్యూస్ :** ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యోగివేమన జయంతి ఘనంగా జరిగింది. ప్రధానోపాధ్యాయులు దాసరి నాగభూషణం యోగివేమన చిత్రపటానికి పుష్పమాలతో అలంకరించారు. సంస్కృత పండితులు బౌరోతు శంకర రావు మాట్లాడుతూ 17వ శతాబ్దానికి చెందిన యోగివేమన చెప్పిన పద్యాలు అక్షర సత్యాలు. విశ్వ మానవాళికి వేమన చెప్పిన పద్యాలు వేదాలతో సమానము. వాడుకు భాషలో అందరికి అర్థమయ్యే రీతిలో పద్యాలు చెప్పారు. వేమన శతకంలో కొన్ని పద్యాలు మాత్రమే మనకు ఎరుక. వేమన స్ఫూర్తితో శంకర శతకాన్ని రచించానని 2025 జూన్ నెల నుండి ఫిబ్రవరి 19వ తారీఖు వరకు శంకర శతక పద్యాలు ప్రార్థనలో రోజుకు ఒక పద్యాన్ని విద్యార్థులతో చదివించ దానికి అవకాశం ఇచ్చిన ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులకి ధన్యవాదాలు తెలియజేశారు. తెలుగు ఉపాధ్యాయులు వేమన గురించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేయాలి

### అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాలి – నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవు : పిడి రామచంద్రరావు




**గరుగుబిల్లి, ఫిబ్రవరి 19,మేజర్ న్యూస్ :** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామ పంచాయతీల్లో ప్రస్తుతం చేపడుతున్న అభివృద్ధి పనులను నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేయాల్సి ఉందని పార్వతిపురం మన్యం జిల్లా డుమా ప్రాజెక్టు డైరెక్టర్ కె రామచంద్రరావు వెల్లడించారు.మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో గురు వారం ప్రస్తుతం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో చేపడుతున్న తారు రోడ్డు పనులతో పాటు, సిమెంట్ రహదారులు, పక్కా కాలువల నిర్మాణాలకు సంబంధించి ఇంజనీరింగ్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసంద ర్భంగా నిర్దేశించిన సమయంలోగా అభివృద్ధి పనులు పూర్తికి సంబం ధించి



ఇంజనీరింగ్ అధికారులకు డుమా ప్రాజెక్ట్ డైరెక్టర్ కె రామచంద్ర రావు దిశ నిర్దేశం చేశారు.అనంతరం పిడి రామచంద్రరావు మాట్లాడుతూ ప్రస్తుతం గరుగుబిల్లి మండలంలోని ఆయా గ్రామపంచాయతీలకు మంజూరు అయిన తారు రోడ్డు నిర్మాణం పనులతో పాటు సిమెంట్ రహదారులు పక్కా కాలువల నిర్మా ణాలను ప్రభుత్వం నిర్దేశించిన సమ యంలోగా పూర్తి చేయాలన్నారు. పనులు పూర్తయిన తదుపరి ఎప్పటికప్పుడు రికార్డింగ్ నమోదు ప్రక్రియను పూర్తి చేసి బిల్లులను అప్ లోడ్ చేయాల్సి ఉందని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో పంచాయతీరాజ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్ వెంకటరావు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి పైడితల్లి, మండల ఇంజనీరింగ్ అధికారి గోపి గౌరీశంకర్రావు, వర్క్ ఇన్స్పెక్టర్ నెల్లి ఈశ్వరరావు తదితరులు ఉన్నారు.

## ఘనంగా చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు





**పాచిపెంట, ఫిబ్రవరి 19, మేజర్ న్యూస్ :** మండల కేంద్రం స్థానిక పాచిపెంటలో చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు స్థానిక యువత ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున యువత బైకులతో స్థానిక భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయం నుంచి ఆంజనేయ స్వామి ఆలయం వరకు పె యువత ర్యాలీ చేపట్టారు. అనంతరం గ్రామ చావిడి వద్ద చత్రపతి శివాజీ చిత్రపటానికి పాలాభిషేకం చేసి, పూలదండలు వేసి నివాళులర్పించారు. సుమారు 300 మంది పేద ప్రజలకు,ఆహార పొట్లాలు, పంపిణీ చేశారు. అలాగే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు, రోడ్లు అందజేశారు. వీటితో పాటుగా పాచిపెంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు చత్రపతి శివాజీ జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీ పెట్టి విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, బహుమతులు అందజేశారు.

## ఘన వ్యర్థల నిర్వహణపై శానిటరీ సిబ్బందికి అవగాహన కార్యక్రమం



**పాలకొండ, మేజర్ న్యూస్ :** పాలకొండ నగర పంచాయతీ పరిధిలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో ఘన వ్యర్థాల నిర్వహణపై శానిటరీ సిబ్బందికి విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ శిక్షణను స్వచ్ఛ ఆంధ్ర -- స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాల కింద ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ ఆధ్వర్యంలో చేపట్టారు.ఈ శిక్షణలో మొత్తం 38 మంది శానిటరీ కార్మికులు పాల్గొని, ఘన వ్యర్థాల నిర్వహణ, ఆరోగ్యం, పరిశుభ్రత మరియు భద్రతా ప్రమాణాలపై సమగ్ర అవగాహన పొందారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కమిషనర్ ఎస్.జే.వి.రతన్ రాజు ,శానిటరీ ఇన్స్పెక్టర్ ఆర్.హేమంత్ కుమార్ హాజరై ప్రసంగించారు. శానిటరీ సిబ్బంది విధులు--బాధ్యతలు, పని సమయంలో ఎదురయ్యే ప్రమాదాలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై వారు విలువైన సూచనలు అందించారు. ముఖ్యంగా గ్లౌజు కిట్‌ను సరైన విధంగా ధరించడం, వ్యక్తిగత పరిశుభ్రతను కాపాడుకోవడం ఎంత అవసరమో స్పష్టంగా వివరించారు. శానిటరీ సిబ్బంది నిబద్ధతతో, బాధ్యతతో పనిచేస్తేనే ప్రజల ఆరోగ్యం పరిరక్షించబడుతుందని వక్తలు తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమం ద్వారా పరిశుభ్రమైన పాలకొండ, ఆరోగ్యకరమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి ఇది దోహదపడుతుందని డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ బి.గణపతమ్మ, రిసోర్స్ పర్సన్ సాయి కిరణ్ నందం తెలిపారు.

# అంగన్వాడీ వ్యవస్థను అణగదొక్కుతున్నారు

## – 23 నుంచి రిలే నిరాహార దీక్షలు – సిఐటియు జిల్లా కార్యదర్శి సూర్యనారాయణ వెల్లడి



**భోగాపురం, ఫిబ్రవరి 19, మేజర్ న్యూస్ :** రాష్ట్రంలోనే ఒక ప్రాముఖ్యమైన అధ్యయనానికి ఊపిరి పోసిందంటే కేవలం అంగన్వాడీ వ్యవస్థేనని, గర్భిణీలు, బాలింతలు, చిన్నపిల్లలకు అనేక సేవలు అందిస్తున్నాయన్నారు. 2019 నుండి అంగన్వాడీల జీతాలపై ఏ ఒక్క ప్రభుత్వం కూడా స్పందించకపోవడం అన్యాయమని సిఐటియు జిల్లా కార్యదర్శి బి.సూర్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వేతనాల పెంపుతో పాటు ఇతర సమస్యలను కూడా పరిష్కరిస్తామన్న హామీ నేటికీ నెరవేరలేదని గుర్తు చేశారు. ఇప్పటికీ అనేక మార్లు ప్రభుత్వానికి విన్నవించినా, నేటి వరకు అంగన్వాడీలకు ఒక రూపాయి కూడా వేతనం పెంచలేదన్నారు. కనీసం రానున్న బడ్జెట్ సమావేశాలు సందర్భంగా అంగన్వాడీల వేతనాలు పెంచాలని కోరుతున్నారు. పలు సమస్యలన్నీ పరిష్కరించాలని కోరుతూ ఫిబ్రవరి 23 నుండి 27వరకు రిలే నిరాహార దీక్షలు ప్రాజెక్టు, జిల్లా స్థాయి నిరాహార దీక్షలు, మార్చి 2న విజయవాడలో మహాధర్నా చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి యూనియన్ నాయకులు జి. ప్రవీణ, పి అనిత, తులసి, యశోద, ఎన్.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

# విద్యా వికాసానికి "చంద్ర"హారం



### భోగాపురం శ్రీ చంద్ర విద్యానికేతన్ పాఠశాలలో ఫేర్వెల్ డే వేడుకలు – అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు







**భోగాపురం, ఫిబ్రవరి 19, మేజర్ న్యూస్ :** ఆ పాఠశాలలో క్రమశిక్షణతో కూడిన విద్యా వికాసం.. ప్రతి విద్యార్థిలో పట్టుదలతో కూడిన ప్రగతి సాధించడం.. మండలంలోనే ప్రగతి దీపికలా విరాజిల్లే శ్రీ చంద్ర విద్యానికేతన్ పాఠశాలని గర్వంగా చెప్పుకోవచ్చు. భోగాపురం మండల కేంద్రంలో ఉన్న ఈ పాఠశాలలో ఫేర్వెల్ డే కార్యక్రమం గురువారం ఎంతో వేడుకగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ వరుపుల మురళి, ప్రిన్సిపల్ వరపుల నాగమణి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో ముందుగా వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి చక్కనైన విద్యా బోధనను అందిస్తూ ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా జిల్లాస్థాయిలో నిర్వహించే టాలెంట్ టెస్టుల్లో తమ విద్యార్థుల ప్రతిభ కనపరుస్తూ, ప్రతి విద్యా సంవత్సరంలో మండలంలోనే అగ్రగామిగా తమ పాఠశాల నిలబడడం అభినందనీయమన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో పలు సినీ గీతాలకు చక్కనైన అభినయాన్ని కనపరచి ఆకట్టుకున్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెమెంటోళ్ళతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అప్పలరాజు, మణికంఠ, మహేష్, రాజు తదితరులు ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

# బాడంగి మెయిన్ రోడ్డుపై డ్రైనేజీ లేక దుర్వాసన భారం

## నిల్వ నీటితో చిట్టి కోనేరులా మారిన ఖాళీ స్థలం.. చర్యల కోసం ప్రజల వేడిక



**బాడంగి, ఫిబ్రవరి 19 (మేజర్ న్యూస్) :** బాడంగి మండల కేంద్రంలోని మెయిన్ రోడ్డుపై సరైన డ్రైనేజీ సౌకర్యం లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో వాణిజ్య, గృహ వినియోగదారులు సొంతంగా నిర్మించుకున్న డ్రైనేజీల్లోనే మురుగు నీరు నిల్వ ఉండిపోతోంది. అంతేకాకుండా కొన్ని షాపుల మధ్య ఉన్న ఖాళీ స్థలాల్లోకి ఈ వాడుక నీరు చేరి నిల్వ ఉండడంతో దుర్వాసన తీవ్రంగా వ్యాపిస్తోంది. ఈ పరిస్థితి కారణంగా ఇరుగు పొరుగు నివాసితులతో పాటు మండల కేంద్రానికి వచ్చి వెళ్లే ప్రయాణికులు ముక్కు మూసుకొని ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. నిల్వ నీటిలో ఈగలు, దోమలు అధికంగా పెరిగి పరిసర ప్రాంత ప్రజలపై దాడి చేస్తున్నాయి. దీంతో ప్రజలు అంటురోగాల బారిన పడుతున్నట్లు స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల కథనం ప్రకారం, ఆర్ అండ్ బి శాఖ కొంత మేర ఖానా నిర్మించింది అయ్యప్ప స్వామి సన్నిధి సమీపంలో ఆ డ్రైనేజీ ఖానా మూతపడింది. దీనివల్ల ముందు భాగంలో ఉన్న ఇళ్ల నుంచి వచ్చే మురుగు నీరు మొత్తం ఒకే చోట చేరి ఖాళీ స్థలాన్ని చిన్న కోనేరుగా మార్చేసింది. ఈ సమస్యపై పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని బాధితులు వాపోతున్నారు. మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపైనే కనీస డ్రైనేజీ సౌకర్యం లేకపోవడం పట్ల ప్రజలు తీవ్ర ఆక్షేపణ వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణం స్పందించి డ్రైనేజీ వ్యవస్థను పూర్తి చేసి, నిల్వ నీరు వెళ్లిపోయేలా చర్యలు తీసుకోవాలని బాధితులతో పాటు ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

# ఖాదర్ షా దర్బార్‌లో రంజాన్ తొలి ఇఫ్తార్ విందు..!





పవిత్ర రంజాన్ పర్వదినాలను గురువారం నుంచి ముప్పై రోజుల పాటు ముస్లిం సోదరులు అత్యంత భక్తి శ్రద్ధలతో ఆచరిస్తారు. సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు కఠోరమైన ఉపవాస దీక్షలను ఆచరించడం రంజాన్‌లో గల ఆధ్యాత్మిక

**విజయనగరం కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం సాయంత్రం బాబామెట్ట హజరత్ ఖాదర్ బాబా దర్గా దర్బార్ షరీఫ్ లో ముతవల్లి డాక్టర్ ముహమ్మద్ ఖలీలుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరీ(ఖలీల్ బాబు) ఆధ్వర్యంలో తొలి ఇఫ్తార్ విందు ఘనంగా జరిగింది. ప్రేమ, త్యాగం, ఆత్మశుద్ధి, ఆధ్యాత్మిక, మానవత్వానికి ప్రతీకగా విశిష్టత. సూర్యాస్తమయం తర్వాత ఉపవాస దీక్షను వీడిన దీక్షాదారులకు పోషక విలువలతో కూడని పసందైన ఆహారంతో ఇఫ్తార్ విందు ను ఖలీల్ బాబు అందిస్తూ వస్తున్నారు. ప్రతీ ఏటా ఖాదర్ బాబా దర్గార్ షరీఫ్ లో జరిగే ఈ ఇఫ్తార్ విందులో అధిక సంఖ్యలో ఉపవాస దీక్షకులు పాల్గొని ఇఫ్తార్ ను స్వీకరిస్తూ ఉంటారు.

# 27న కుమిలిలో దేవేరుల కల్యాణోత్సవం



**పూసపాటిరేగ, ఫిబ్రవరి 19, మేజర్ న్యూస్ :** శ్రీ మహాకాళి గణపతి తదితర దేవాలయాల దేవాలయాల వార్షిక కళ్యాణోత్సవాలు ఈనెల 27న అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు దేవాదాయ శాఖ పలు ఏర్పాట్లను చేస్తోంది. అందులో భాగంగా దేవేరుల కల్యాణోత్సవాలకు ముందుగా శుక్రవారం గోధుమ రాయితో కార్యక్రమాలను నిర్వహించేందుకు అంకురార్పణ చేయనున్నారు. జిల్లాలోనే కుమిలి ద్వాదశ దేవాలయంలో పలు దేవతామూర్తులను ఒకే చోట వివాహాలు నిర్వహించడం గత కొన్నేళ్లగా ఆనవాయితీగా వస్తోంది. ద్వాదశ దేవాలయంలో కొలువైవున్న శ్రీ ఛాయాపద్మిని సమేత సూర్యనారాయణ మూర్తి, శ్రీ అలివేలు మంగ, పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి, శ్రీ రమా సమేత సత్యనారాయణ స్వామి, శ్రీ లక్ష్మీ సమేత నృసింహ స్వామి, శ్రీ సీతారామ స్వామి, శ్రీ రాధ, రుక్మిణి సమేత వేణుగోపాల స్వామి వారికి ఒకే వేదికపై ఉత్సవమూర్తులకు వేద పండితుల సమక్షంలో భక్తుల కనులవిందుగా వివాహాలను జరిపించనున్నారు. వివాహాల అనంతరం ఉత్సవమూర్తులకు ఊరేగింపు కార్యక్రమాలను కూడా నిర్వహిస్తారు. ఈ వార్షిక కళ్యాణోత్సవాలను నిర్వహించేందుకు ఆలయ కార్యనిర్వాక అధికారులు సన్నాహాలు చేయడంతో ఇప్పటికే ఆలయం సర్వాంగ సుందరంగా ముస్తాబయింది. ఈ దేవేరుల వివాహాలను తిలకించేందుకు పరిసర గ్రామాలకు చెందిన వారే కాకుండా విశాఖపట్నం పరిసర ప్రాంతాలకు చెందిన వారు కూడా భక్తజనం తరలి వస్తారని దేవాదాయశాఖ అంచనా వేస్తోంది.

## రసాయన ఎరువులు
# అధికంగా వాడితే క్యాన్సర్ తప్పదు




**గుర్ల, ఫిబ్రవరి, 19మేజర్ న్యూస్ :** పంట పొలాల్లో రసానికి ఎరువులు విచ్చలవిడిగా వాడితే క్యాన్సర్ కు గురవుతున్నారని ఇన్సెక్టిసైడ్స్ ఇండియా లిమిటెడ్ డెవలప్మెంట్ అధికారి గోపిరాజు హెచ్చరించారు. గురువారం చింతల పేట గ్రామ లో ఇన్సెక్టిసైడ్స్ ఇండియా లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో పురుగు మందులు వాడకంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, నష్టాలుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా గూడెం సొసైటీ చైర్మన్ పిల్లా అప్పలనాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆ సంస్థ అధికారి గోపి రాజు మాట్లాడుతూ రసాయనిక ఎరువులు పిచికారి చేసినప్పుడు హ్యాండ్ కి గ్లౌజులు,ముఖానికి మాస్కులు మరియు పంపు సెట్ యొక్క నాజులు నోట్లో పెట్టరాదని,కళ్ళకు కళ్ళద్దాలు పెట్టుకోవాలని సూచించారు.మన దేశం లో అత్యధికంగా పంటలు పండించే రాష్ట్రంగా పంజాబ్ ఉండేదని అక్కడ అవగాహన లేకుండా విచ్చలవిడిగా మందులను పిచికారి చేయడం వలన ఇప్పుడు ఆ రాష్ట్రం క్యాన్సర్ రాష్ట్రంగా ఉందని తెలిపారు.ప్రతి సంవత్సరం ఈ పురుగు మందులవాడకం నుండి ఆహార పదార్థాలు తినడం వలన వచ్చే క్యాన్సర్ సుమారుగా లక్ష మంది రైతులు చనిపోతున్నారని తెలిపారు.రైతు తగు జాగ్రత్తలు తీసుకొని పిచికారి చేయాలని ఆయన తెలియజేశారు.సొసైటీ చైర్మన్ అప్పలనాయుడు మాట్లాడుతూ రైతులంతా విషయాన్ని అవగాహన చేసుకుని రానున్న రోజుల్లో ఎరువులు తగ్గించి సేంద్రియ ఎరువులపై దృష్టి సారించినట్లయితే అదే దిగుబడి వస్తుందని రైతులకు వివరించారు.ఇప్పటికే చాలా చోట్ల రైతులు సేంద్రియ వ్యవసాయం ద్వారా లాభాలు సాధిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం కూడా రసాయన ఎరువులు తగ్గించాలని సూచనలు ఇస్తుందని ఆ మేరకే రైతులు తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆ సంస్థ సేల్స్ఎగ్జిక్యూటివ్ అధికారి ఎస్ అప్పలరాజు, గ్రామ పెద్దలు పిల్ల రమణ ఎక్స్ ఎంపీటీసీ చింతపల్లి సత్యం, గ్రామ నాయకులు,మజ్జి గౌరి నాయుడు,స్కూల్ చైర్మన్ విసినిగిరి అచ్చంనాయుడు రైతులు పాల్గొన్నారు.

## వంగపల్లిపేటలో ఉచిత కంటి వైద్య శిబిరం



**చీపురుపల్లి ఫిబ్రవరి 19 మేజర్ న్యూస్ :** పట్టణంలోని వంగపల్లిపేటలో మానవీయత స్వచ్ఛంద సేవ సంస్థ అధ్యక్షుడు బీవీ గోవిందరాజులు ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. విజయనగరానికి చెందిన పుష్పగిరి నేత్ర వైద్యశాల వైద్య సిబ్బంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 94 మంది వైద్య పరీక్షలు చేయించుకోగా వారిలో శస్త్రచికిత్సకు 26 మంది ఎంపిక చేయబడ్డారు. కళ్ళ అద్దములు కొరకు 55 మందిని గుర్తించారు. కార్యక్రమంలో వైద్యశాల పీఆర్‌వి నాగరాజు, గుడివాడ రామ్మూర్తి నాయుడు, రామదాసు, అప్పారావు పాల్గొన్నారు.

### గురుకుల ప్రవేశాలకు

## మార్చి 3లోగా దరఖాస్తు చేసుకోవాలి



**నెల్లిమర్ల, ఫిబ్రవరి 19, మేజర్ న్యూస్ :** జిల్లాలోని మహాత్మా జ్యోతిబా ఫూలే బీసీ సంక్షేమ గురుకులాల్లో ఇంటర్, 5వ తరగతి, బ్యాక్ లాగ్ (6,7,8)తరగతుల ప్రవేశాల కోసం మార్చి 3లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కన్వీనర్ డాక్టర్ కేబీబీ రావు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 5వ తరగతిలో నెల్లిమర్ల, గంట్యాడ, కొత్తవలస బాలికల పాఠశాలల్లో మొత్తం 160 సీట్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. నెల్లిమర్ల (మత్స్యకార), విజయనగరం, గజపతి నగరం, బొబ్బిలి బాలుర పాఠశాలల్లో మొత్తం 200 సీట్లు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. 5వ తరగతి ప్రవేశాలకు 12-04-2026న, ఇంటర్, బ్యాక్ లాగ్ సీట్లకు 19-04-2026న ప్రవేశ పరీక్ష ఉంటుందని చెప్పారు. విద్యార్థులు https://mjpapbcwreis.apcfss.in/దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

## ముఖ్యమంత్రి గారు గ్రామ వాలంటీర్ల కోసం అసెంబ్లీ సమావేశాల్లో ప్రకటించండి : సిపిఐ డిమాండ్



**బొబ్బిలి, ఫిబ్రవరి 19 (మేజర్ న్యూస్) :** రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామవలంటిర్ల అందరికి న్యాయం చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చెప్పిన మాటలు నిలబెట్టుకునే విధంగా ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రకటించాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట అప్పన్న రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పత్రిక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ ఎంతోమంది గ్రామ. వార్డు వాలంటీర్లు. ఈ కూటమి ప్రభుత్వాన్ని నమ్మి రాష్ట్రంలో 1 లక్షా 65 వేల మంది రాజీనామాలు చేయకుండా ఎన్నో ఆశలు పెట్టుకొని ఎదురు చూస్తున్న వాలంటీర్లుకు కూటమి ప్రభుత్వం అధికారులకు వచ్చిన తర్వాత వాలంటీర్లకు నమ్మకద్రోహం చేసిందని అన్నారు. ఎన్నికల ప్రచారంలో వాలంటీర్లకు ప్రస్తుత డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వాలంటీర్ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత మాట తప్పడం అన్యాయమన్నారు. అలాగే ఎన్నికల ప్రచారంలో భాగంగా నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి 3 వేలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు దాటుతున్న ఇంతవరకు ఎటువంటి నిరుద్యోగ భృతి ఇవ్వ లేదని అన్నారు. ఎంతోమంది యువత రాష్ట్రంలో ఉద్యోగ అవకాశాలు లేక వలసలు పోయే పరిస్థితి వస్తుందని అన్నారు. ఇప్పటికైనా గౌరవ ముఖ్యమంత్రి స్పందించి ప్రస్తుతం జరుగుతున్నటువంటి అసెంబ్లీ సమావేశాల్లో ఏదైతే గ్రామ వార్డు వాలంటీర్లకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి3 వేలు. మూతపడిన జ్యూట్ మిల్లులు షుగర్ ఫ్యాక్టరీలు తెరిపించుట కోసం ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించాలని కోరారు.

# వేసవిలో మంచినీటి ఎద్దడి నివారణకు చర్యలు

### – రూ.కోటి ఇరవై లక్షలతో సమ్మర్ యాక్షన్ ప్లాన్





**విజయనగరం కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** విజయనగరం నగర వాసులకు రానున్న వేసవిలో మంచినీటి సరఫరాకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. దీనిలో భాగంగా నెల్లిమర్ల, రామతీర్థం, కుదిపి వాటర్ వర్క్స్ దగ్గర చంపావతి నదిలో నీటి నిల్వలు పెంచేందుకు కోటి ఇరవై లక్షల రూపాయల ఒక కార్యాచరణ ప్రణాళిక తయారు చేశారు. నిధుల మంజూరుకు సంబంధించి నగర పాలక సంస్థ స్టాండింగ్ కమిటీ కూడా ఆమోదం తెలియజేసింది. ముందస్తు చర్యల్లో భాగంగా నెల్లిమర్ల పంప్ హౌస్, హెడ్ వాటర్ వర్క్స్ ను నగర పాలక సంస్థ కమిషనర్ బి బాలస్వామి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పిఎస్ వివి ప్రసాద్, డిప్యూటీ ఇంజనీర్ ( వాటర్ వర్క్స్) నరసింహారెడ్డి, వాటర్ వర్క్స్ ఇన్ ఛార్జ్ ఏఈ బొడ్డు రవికుమార్ గురువారం సందర్శించారు. అక్కడి పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించారు. నెల్లిమర్ల, రామతీర్థం, కుదిపి వాటర్ వర్క్స్ నుంచి రోజు విడిచి రోజు 17 ఎంఎల్ డి మంచినీటి సరఫరా జరుగుతోంది. రానున్న వేసవిలో కూడా నీటి సరఫరా సామర్థ్యం ఏమాత్రం తగ్గకుండా చూసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను కమిషనర్ బాలస్వామి ఆదేశించారు.

**చంపావతిలోకి ఆంధ్ర జలాశయం నుంచి నీరు విడుదల :** చంపావతి నదిలోకి ఆంధ్ర జలాశయం నుంచి నీటిని విడుదల చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ రామ సుందర్ రెడ్డికి నగర పాలక సంస్థ కమిషనర్ బి బాలస్వామి ఒక లేఖ రాసినట్లు తెలిసింది. చంపావతి నదిలోకి నీటిని విడుదల చేయడం వల్ల నెల్లిమర్ల,రామతీర్థం, కుదిపి ఊటబావుల్లో నీటి నిల్వలు పెరుగుతాయి. నీరు రీఛార్జ్ అయ్యేలా ఊటబావుల వద్ద ఇసుక బస్తాలతో అడ్డుకట్ట వేసేందుకు నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులు చర్యలు చేపట్టారు. ప్రతీ ఏటా వేసవిలో విజయనగరం పట్టణ వాసులకు మంచినీటి సరఫరాలో అంతరాయాలు లేకుండా ఆంధ్ర జలాశయం నుంచి చంపావతి నదిలోకి నీటిని విడుదల చేయడం జరుగుతోంది. ఈ ఏడాది కూడా సమ్మర్ యాక్షన్ ప్లాన్ లో భాగంగా నెల్లిమర్ల రామతీర్థం కుదిపి ఊటబావుల్లో నీటి నిల్వలు పెంచి మంచినీటి సరఫరాలో ఆటంకం లేకుండా తగిన చర్యలు చేపడుతున్నారు.

# ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు హెచ్‌ఆర్ పాలసీ ప్రకటించాలి

### – ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మన్ మహేంద్రబాబు డిమాండ్



**విజయనగరం కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి 'ఉన్నత స్థాయి కమిటీ'ని నియమించినట్లే, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సమస్త ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను అధ్యయనం చేయడానికి వెంటనే ఒక "హై పవర్ కమిటీ"ని ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ జేఏసీ విజయనగరం జిల్లా చైర్మన్ జి.మహేంద్రబాబు కోరారు.

గురువారం మేజర్ న్యూస్ ప్రతినిధితో ఆయన మాట్లాడుతూ కేవలం వేతనాలు ఇవ్వడమే కాదు, ఉద్యోగులకు ఉండాల్సిన గౌరవం, పదోన్నతులు, ఆరోగ్య భద్రత, రిటైర్మెంట్ బెనిఫిట్స్ వంటి అంశాలను హెచ్‌ఆర్ పాలసీలో పొందుపరచాలని చెప్పారు. హెచ్ ఆర్ పాలసీని పీఏసీఎస్ సిబ్బందికి ఇచ్చినట్లే... గతంలో సర్ఫ్, మెప్మాకి ఇచ్చిన విధంగా అన్ని శాఖల ఔట్ సోర్సింగ్ సిబ్బందికి కూడా 'హెచ్‌ఆర్ పాలసీ'ని రూపొందిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. పీఏసీఎస్ ఉద్యోగుల సేవలను గుర్తించి వారికి సర్వీస్ రూల్స్, హెచ్ ఆర్ పాలసీ పాలసీ ఇస్తున్నప్పుడు, దశాబ్దాలుగా ప్రభుత్వ కార్యాలయాలే ఇళ్లుగా భావించి పని చేస్తున్న ఇతర ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను ఎందుకు విస్మరిస్తున్నారని ఆయన ప్రశ్నించారు. పీఏసీఎస్ ఉద్యోగులకు కల్పించినట్లుగానే, మిగతా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు స్పష్టమైన విధానాలతో కూడిన హెచ్ ఆర్ పాలసీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఆవిధంగా చేయకపోతే హక్కుల సాధన కోసం పోరాటాన్ని ఉధృతం చేస్తామని మహేంద్రబాబు హెచ్చరించారు.

# నేడు కాగాం పైడితల్లి అమ్మవారి ప్రతిష్ఠా మహోత్సవాలు



**తెర్లాం ఫిబ్రవరి 20 (మేజర్ న్యూస్) :** నేడు కాగాం గ్రామంలో శ్రీశ్రీశ్రీ పైడితల్లి అమ్మవారి ప్రతిష్ట మహోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు బ్రహ్మశ్రీ వేమకోటి వెంకటరమణ సిద్ధాంతిగారిచే ప్రతిపాదించిన కీర్తిశేషులు కాగా కొరహా నరసింహ పట్నాయక్ కుటుంబ సభ్యులచే నిర్మించబడిన పైడితల్లి అమ్మవారి ఆలయ ప్రతిష్ట మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు కమిటీ వారు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేశారు. శుక్రవారం ఉదయం తొమ్మిది గంటల 45 నిమిషాలకు వినాయక పూజ గోపూజ యాగశాల ప్రవేశం అఖండ దీపారాధన పూజా కార్యక్రమాలు సాయంత్రం ఐదు గంటలకు దేవతాయంత్ర విగ్రహ శిఖర కలశ గ్రామ ప్రదర్శన జలాధివాసం అగ్ని ప్రతిష్ట సర్వదేవత హోమములు బలిహరణ నీరాజనశీ మంత్రపుష్పం వేద స్వస్తి ప్రసాద వితరణ ఉంటాయన్నారు. 21 శనివారం ఉదయం 8 గంటలకు ప్రాత:కాలార్చన సర్వదేవత హోమములు క్షీరాధివాసం మహా న్యాస పూర్వక రుద్రాభిషేకం ధాన్యాధివాసం ఉంటాయని తెలిపారు .సాయంత్రం నాలుగు గంటల 45 నిమిషాలకు సర్వదేవతా హోమములు సామూహిక కుంకుమార్చనలు పనిచేయాలి వాసము నీరాజనం మంత్రపుష్పం వ్యాధి స్వస్తి ప్రసాద వితరణ అలాగే 22 ఆదివారం ఉదయం ఎనిమిది గంటలకు సర్వ దేవత హోమములు గార్తన్యాసము రత్నం న్యాసం దాతున్యాసము 11.57 నిమిషాలకు శ్రీశ్రీశ్రీ పైడితల్లి అమ్మవారి యంత్ర విగ్రహ శిఖర కలస ప్రతిష్టలు జీవకలా న్యాసము దేని దర్శనం దర్పణ దర్శనం సర్వదర్శనం కూష్మాండ అన్న బలహరణ పూర్ణాహుతి మహా సంప్రోక్షణ మహా శీర్వచనాలు ఉంటాయన్నారు. అనంతరం మధ్యాహ్నం ఒంటిగంటకు అన్న సమారాధన కార్యక్రమాన్ని కొనసాగుతుందని భక్తులందరూ అందులో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కమిటీ నిర్వాహకులు తెలియజేశారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం : ఎలక్ట్రికల్ ఎక్జిక్యూటివ్ ఇంజనీర్ కే.గోపాలరావు నాయుడు



**సీతానగరం, ఫిబ్రవరి 19, మేజర్ న్యూస్ :** పార్వతీపురం మన్యం జిల్లా ట్రాన్స్ కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆదేశాల మేరకు మండల బూర్జ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మెంటినెన్స్ పనులు కార ణంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయడం జరుగుతుందని ఎలక్ట్రికల్ ఎక్జిక్యూటివ్ ఇంజనీర్ కే.గోపాల రావు నాయుడు తెలిపారు. బూర్జ సబ్‌స్టేషన్ పరిధిలో పలుచోట్ల విద్యుత్ లైన్‌లకు ఆనుకుని ఉన్న చెట్లు కొమ్మలను తొలగించడంతో పాటు విద్యుత్తు లైన్‌ల పరిధిలో నిర్వహణ పనులు కారణంగా విద్యుత్తు సరఫరాను నిలుపుదల చేయడం జరుగుతుందని వినియోగదారులు ఈ విషయంను గమనించాలని సహకరించాలని కోరారు.

## ఉపాధి హామీ పథకం ఎంతోమందికి జీవనాధారం



**రణస్థలం, ఫిబ్రవరి 19, మేజర్ న్యూస్:**రణస్థలం మండలం, కోష్ట పంచాయతీలో సామాజిక తనిఖీ గ్రామ సభ 2024-25 వ సంవత్సరం జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రజలకి అందించిన పనులకు గాను జరిగిన ఆడిట్ కార్యక్రమంలో పాల్గున్న టీడీపీ సీనియర్ నాయకులు పిసిని జగన్నాధం నాయుడు పాల్గొని మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా ఎంతోమంది జీవనాధారంగా ఉపయోగపడిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ఆసిరినాయుడు , యువ నాయకులు పిసిని హరికృష్ణ , స్పెషల్ ఆఫీసర్, కూటమి నాయకులు, ఏ పి ఓ, ఆడిట్ ఆఫీసర్ సచివాలయం సిబ్బంది, సెక్రెటరీ, టెకినికల్ అసిస్టెంట్, పిసిని చిన్నారావు పిసిని చిన్నా , తదితరులు పాల్గొన్నారు.

## జేఈఈ మెయిన్స్ లో మెరిసిన తామరాపల్లి విద్యార్థి



**నరసన్నపేట ఫిబ్రవరి 19 మేజర్ న్యూస్ :**ఓ పేదింటి విద్యా కుసుమం ఇటీవల విడుదలైన జేఈఈ మెయిన్స్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచింది. నరసన్నపేట మండలం తామరపల్లి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కళాశాల విద్యార్థి శ్రీరామ అస్మిత 72.46 పర్సంటేల్ సాధించి ప్రతిభ చూపింది. ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న అస్మిత ఉన్నత చదువులు చదివి సాఫ్ట్వేర్ ఇంజనీరుగా ఉద్యోగం సాధించాలనే ప్రతిభతో ముందుకు సాగుతున్నట్లు ఆమె అన్నారు. ఈమె తల్లిదండ్రులు శ్రీరామ కృష్ణారావు, కవిత రోజు కూలీలుగా పనులు చేసుకుంటూ ఉంటారు. విద్యార్థిని ప్రిన్సిపల్ ఆర్ వి కృష్ణ తార, అధ్యాపక బృందం అభినందించారు.

## మోడల్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తు ఆహ్వానం



**నరసన్నపేట ఫిబ్రవరి 19 మేజర్ న్యూస్ :** పోలాకి మండలం ఈదులవలస ఏపీ మోడల్ పాఠశాలలో 5వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ పైడి ప్రవీణ తెలియజేశారు. ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు ప్రవేశ పరీక్ష ద్వారా మోడల్ పాఠశాలలో ఆరువ తరగతిలో ప్రవేశం పొందవచ్చునని ఆమె తెలియజేశారు. అర్హత గల విద్యార్థులు ఈనెల 23వ తేదీ నుండి మార్చి 31వ తేదీ లోగా ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని ఆమె సూచించారు. ప్రవేశ పరీక్షను ఏప్రిల్ 12వ తేదీన ఉదయం 10 గంటల నుండి 12:00 వరకు పాఠశాల ఆవరణలో నిర్వహిస్తామన్నారు. ప్రవేశ పరీక్షలో పొందిన మార్కుల ఆధారంగా, స్థానిక రిజర్వేషన్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తామన్నారు. ప్రవేశ పరీక్షకు ఓసి/బిసి విద్యార్థులు 200 రూపాయలు ఫీజును, ఎస్సీ/ ఎస్టీ విద్యార్థులు 125 రూపాయలను ఆన్లైన్లో ఫీజును చెల్లించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఇతర వివరాలకు ఈదలవలస మోడల్ పాఠశాల కార్యాలయాన్ని సంప్రదించవచ్చునని అన్నారు

## పాఠశాలలను తనిఖీ చేసిన ఎంఈఓ లు



**నరసన్నపేట ఫిబ్రవరి 19 మేజర్ న్యూస్:**నరసన్నపేట మండల విద్యాశాఖ అధికారులు గురువారం మండలంలోని పలు పాఠశాలలను తనిఖీ చేశారు. బాడాం, కానుకుర్తి వాని పేట, సత్యవరం, పాఠశాలలను ఎంఈఓ ఉప్పాడ శాంతారావు, ఎంఈఓ 2 పేడాడ దాలినాయుడు తనిఖీ చేశారు. బాడం ఉన్నత పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో ఎంఈఓ పాల్గొని తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వ పాఠశాల మనుగడకు తల్లిదండ్రులు సహకరించాలని, ప్రభుత్వ పాఠశాలలోనే మెరుగైన విద్య లభిస్తుందని, శిక్షణ పొందిన ఉపాధ్యాయులతో ఉచిత విద్యను, ఉచిత మధ్యాహ్న భోజనాన్ని, పాఠ్యపుస్తకాలను అందజేస్తూ విద్యార్థుల ప్రగతికి ఉపాధ్యాయ నిరంతరము కృషి చేస్తారని ఆయన అన్నారు. అనంతరము పలు పాఠశాలల రికార్డులను విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మధ్యాహ్న భోజనాలను పరిశీలించారు

## ఆఫ్షోర్ నిర్వాసితులకు నష్టపరిహారం పంపిణీ



**పలాస, ఫిబ్రవరి 19, మేజర్ న్యూస్:**పలాస మండలం రేగులపాడు వద్ద నిర్మిస్తున్న ఆఫ్షోర్ రిజర్వాయర్ నిర్మాణం పనుల్లో భూములు,ఇల్లు కోల్పోయిన నిర్వాసితులకు గురువారం పలాస ఆర్డిఓ కార్యాలయంలో ఆర్డీవో జి వెంకటేష్ సమక్షంలో నష్టపరిహారాన్ని స్థానిక టిడిపి నాయకులు పంపిణీ చేశారు.ఈ రిజర్వాయర్ లో ఇల్లు కోల్పోతున్న 58 మంది నిర్వాసితులకు 58 లక్షలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆర్డిఓ జి వెంకటేష్ మాట్లాడుతూ నిర్వాసితులకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం అందజేయడం జరుగుతుందని, రిజర్వాయర్ పనులు పూర్తి చేయడానికి రైతులు సహకరించాలని కోరారు. ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబురావు మాట్లాడుతూ ఆఫ్ షోర్ రిజర్వాయర్ పనులు వేగవంతం చేసి 2027 నాటికి పూర్తిచేసి రిజర్వాయర్లో నీరు నింపాలనే సంకల్పంతో ఎమ్మెల్యే గౌతు శిరీష కృషి చేస్తున్నారని అన్నారు.రిజర్వాయర్ పనులు పూర్తి చేస్తే నందిగాం,వజ్రపు కొత్తూరు,పలాస,మెలియాపుట్టి మండలాలకు సాగునీరుతో పాటు పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ ప్రజలకు త్రాగునీరు అంతే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పలాస తహసిల్దార్ టి కళ్యాణ్ చక్రవర్తి, వంశధార ఏఈ శేఖర్ బాబు, టిడిపి నాయకులు పీరుకట్ల విఠల్, మల్లా శ్రీనివాసరావు,కుత్తుం లక్ష్మణరావు, దువ్వాడ సంతోష్ కుమార్,అవుగాన దశరథరావు తదితరులు పాల్గొన్నారు.

## సొంట్యాన కుటుంబాన్ని పరామర్శించిన సిరిపురం



**కొత్తూరు ఫిబ్రవరి 19(మేజర్ న్యూస్ ):** పార్వతీపురం మన్యం జిల్లా భామిని మండలం బురుజోల గ్రామానికి చెందిన సొంట్యాన లక్ష్మీనారాయణ గుండె పోటు తో మృతి చెందడం తో మృతుని కుటుంబాన్ని శ్రీకాకుళం జిల్లా బీజేపి అధ్యక్షులు సిరిపురం తెజేశ్వరరావు గురువారం పరామర్శించారు.మృతి చెందిన లక్ష్మీనారాయణ,పూర్వపు జిల్లా బీజేపి కార్యదర్శి ఒలు రౌతు ప్రసాదరావు మామగారు.. జిల్లా అధ్యక్ష పదవి చేపట్టిన తర్వాత పార్టీ అభివృద్ధి కి కృషి చేస్తున్న నాయకులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారో అర్ధమౌతుంది. కొత్తూరు మండలం బీజేపి నాయకులతో కలసి వెళ్లి మృతుని కుటుంబానికి పరామర్శించి ప్రగాఢ సానుభూతీ తెలియజేశారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షులు బూరాడ భాస్కారరావు,జిల్లా కార్యదర్శి కాపల దమయంతి,జిల్లా కార్యవర్గ సభ్యులు సి హెచ్ నరసింహా మూర్తి,మండల ప్రధాన కార్యదర్శి చల్ల ఈశ్వరరావు, రిగేటి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు

## రేకులు, రాడ్లు పంపిణీ



**సంతబొమ్మాలి, ఫిబ్రవరి 19,మేజర్ న్యూస్ :**పోర్ట్ నిర్వాసిత గ్రామమైన మూలపేట గ్రామస్తులకు రేకులు, రాడ్లను టెక్కలి ఆర్డిఓ కృష్ణ మూర్తి చేతుల మీదగా గురువారం పంపిణీ చేశారు. ఒక్కొక్క రేషన్ కార్డ్ దారుడుకు 33 రేకులు 22 రాడ్లు లను అందజేశారు. మొత్తం 340 కుటుంబాలకు ఈ సామగ్రి అందజేస్తామని తెలిపారు. నిర్వాసితులకు కేటాయించిన ఆర్ అండ్ ఆర్ కాలనీలో తమకు కేటాయించిన స్థలములో తాత్కాలికంగా షెడ్లలను వేసుకుని ఇల్లు నిర్మాణం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ హేమ సుందర్ రావు, వీఆర్వో ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి అనిల్ ప్రభాస్ తదితరులు ఉన్నారు.

## మహిళలు, పిల్లలు సమాజానికి మూల



**పాడేరు మేజర్ న్యూస్ ఫిబ్రవరి:19:** మహిళలు ,పిల్లలు భద్రతపై అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్ బర్డర్ ఆదేశాల మేరకు గురువారం పాడేరులో అవగాహన సదస్సు కార్యక్రమం జిల్లా పోలీసు వారి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో పాడేరు డిఎస్పీ మాట్లాడుతూమహిళలు, పిల్లలు సమాజానికి ఆధారస్తంభాలు. ఒక సమాజం అభివృద్ధి చెందాలంటే అక్కడ మహిళలు, పిల్లలు సురక్షితంగా ఉండాలని. వారి భద్రతను కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత. ముఖ్యంగా పోలీస్ శాఖగా మేము వారి రక్షణకు ఎల్లప్పుడూ కట్టుబడి ఉన్నాము. ప్రస్తుతం మహిళలపై వేధింపులు, బాలలపై దాడులు, సైబర్ నేరాలు పెరుగుతున్నాయి.ఈ నేపథ్యంలో ప్రభుత్వం మహిళలు, పిల్లల రక్షణ కోసం అనేక చట్టాలను అమలు చేసిందని, ఉదాహరణకు: మహిళల రక్షణ కోసం ౖాతీశీవ్ఱశీఅ శీట ఔశీఎవఅ టతీశీఎ ఐశీఎవర్‌ఱష ఎఱశీశ్రీవఅషవ ూష్ట్ పిల్లలపై లైంగిక నేరాలను అరికట్టేందుకు ూూజూూ ూష్ట్ అత్యవసర సహాయం కోసం ఔశీఎవఅ నవశ్రీజూశ్రీఱఅవ 181, పోలీస్ అత్యవసర సేవల కోసం ఐఖుశ్రీ 112 మరియు శక్తి యాప్. తల్లిదండ్రులు తమ పిల్లలపై శ్రద్ధ వహించాలి. పిల్లలు ఎవరితో మాట్లాడుతున్నారు? సోషల్ మీడియాను ఎలా వాడుతున్నారు? అన్న విషయాల్లో జాగ్రత్తగా ఉండాలి. పిల్లలకు "గుడ్ టచ్ -- బ్యాడ్ టచ్" గురించి అవగాహన కల్పించాలని. మహిళలు కూడా భయపడకుండా ముందుకు రావాలి. ఏదైనా అన్యాయం జరిగితే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలి. మీ రక్షణకు మేమున్నాము. పోలీస్ శాఖగా మేము పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ మహిళల, పిల్లల భద్రత కోసం కృషి చేస్తున్నాము. సమాజం, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పోలీసులు అందరం కలిసికట్టుగా పనిచేస్తేనే నేరాలను పూర్తిగా అరికట్టగలం. "మహిళ సురక్షితంగా ఉంటే కుటుంబం సురక్షితం,కుటుంబం సురక్షితం అయితే సమాజం సురక్షితం. అని తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐ సి డి ఎస్ పి డి ఝాన్సీ, సైకియాట్రిస్ట్ డాక్టర్ రాజు, ఐసిడిఎస్ సిడిపిఓ, శారద, చీ×జఱు చీణూ పూజ మరియు కౌన్సిలర్ శాంతి మరియు పాడేరు సిఐ దీనభందు పాడేరు ఎస్ఐ పాపి నాయుడు పలువురు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల పట్ల అప్రమత్తత అవసరం



**డుంబ్రిగుడ, ఫిబ్రవరి 19, మేజర్ న్యూస్:** – ప్రస్తుత సమాజంలో సైబర్ నేరాల పట్ల అప్రమత్తత అవసరమని అరకు సీఐ హిమగిరి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సే నో టు డ్రగ్స్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు రోడ్డు భద్రత నియమాలు పాటించి ప్రమాదాల నివారణకు తోడ్పాటునివ్వాలని, మత్తు పదార్థలకు దూరంగా ఉండాలన్నారు. పది పరీక్షలకు ధృఢ సంకల్పంతో ముందుకెళ్లి ఫలితాలను సాధించాలన్నారు గంజాయి వంటి మత్తు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన సూచించారు ఎంపీడీవో ప్రేమ్కుమార్, ఎంఈవో సుందర్రావు, ఎస్సై సురేస్ తదితరులు పాల్గొన్నారు.

## ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య



**హుకుంపేట. ఫిబ్రవరి 19.సూర్య(మేజర్ న్యూస్ ):**ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ (ఇఎమ్ఆర్ఎస్)సుదూర ప్రాంతాల్లోని గిరిజన (ఎస్టీ)విద్యార్థులకు నాణ్యమైన విద్యను ఉచితంగా అందించే కేంద్ర ప్రభుత్వ నివాస పాఠశాలలు. 6నుండి 12వ తరగతి వరకు, నవోదయ పాఠశాలలతో సమానమైన ప్రమాణాలతో ఇంగ్లీష్ /స్థానిక బాషలలో బోధన, ఆధునిక వసతులు, క్రీడలు మరియు స్థానిక కళల సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టడం వీటి ముఖ్య ప్రత్యేకత.. ఈ సందర్బంగా స్థానిక ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సంతోష్ కుమార్ ఉజ్వల్ మాట్లాడుతూ గురువారం మండల పరిధిలో ఉన్న ప్రాథమిక, జిఇఎస్ పాఠశాలలకు తమ సిబ్బందితో కలసి వెళ్లడం జరిగిందని 2026-2027 సంవత్సరానికి ఆరవ తరగతిలో ప్రవేశం కొరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. ఆరవ తరగతి ప్రవేశ ప్రకటన కొరకు ఈ నెల 5వ తారీకు నుండి ఆన్లైన్ అప్లికేషన్స్ నమోదు చేయడం జరుగుతుందని అందువల్ల ఈ నెల 28వ తేదీ లోపు రిజిస్ట్రేషన్ చేసుకుగలరని విద్యార్థులకు ప్రిన్సిపాల్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తో పాటు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీ వారి సేవలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ



**మునగపాక, ఫిబ్రవరి 19, మేజర్‌న్యూస్:** తిరుమలలోని తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం లో గురువారం తెల్లవారుజామున జరిగిన పవిత్రమైన తోమాల సేవలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ కుటుంబ సభ్యులతో కలిసి భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీవారికి మొక్కులు చెల్లించుకుని శ్రీ వెంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో ఉండాలని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని స్వామివారిని ప్రార్థించారు

## సబ్ జైలును సందర్శించిన జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి



**నర్సీపట్నం , ఫిబ్రవరి 19, మేజర్‌న్యూస్:** విశాఖపట్నం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్), ఉమ్మడి విశాఖ జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి ఆర్ సన్యాసినాయుడు గురువారం నర్సీపట్నం సబ్ జైలును సందర్శించారు. సబ్ జైలును పరిశీలించి, ఖైదీలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన ఖైదీలతో మాట్లాడి వారి సాధక బాధకాలు అడిగి తెలుసుకున్నారు. సబ్ జైలులో భోజనం, వసతులు ఏ విధంగా ఉన్నవి అడిగి తెలుసుకున్నారు. కేసును వాదించడానికి లాయర్ ను పెట్టుకునే స్తోమత లేని వారు మండల లీగల్ సర్వీసెస్ కమిటీకి తెలియజేస్తే ఉచితంగా లాయర్ ను ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట న్యాయవాదులు నగిశెట్టి గంగబాబు, నందారపు కృష్ణ, న్యాయస్థానం సిబ్బంది ఆశ, లీగల్ సర్వీసెస్ వాలంటీర్లు, జైలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జోగంపేట విద్యార్థి ఎవరెస్ట్ అధిరోహణ ట్రైనింగ్‌కు ఎంపిక



**గొలుగొండ, ఫిబ్రవరి 19, మేజర్‌న్యుస్:** జోగంపేట జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన దివ్యాంగ విద్యార్థి లెక్కల హరిశ్రీ దుర్గాప్రసాద్ అరుదైన ఘనత సాధించాడు. ప్రపంచంలోని ఎత్తైన శిఖరమైన మౌంట్ ఎవరెస్ట్ అధిరోహణ లక్ష్యంగా నిర్వహించే జాతీయ స్థాయి హై ఆల్టిట్యూడ్ ట్రైనింగ్‌కు ఎంపికై తన ప్రతిభను చాటుకున్నాడు. విశాఖపట్నంలోని ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన జోనల్ అడ్వెంచర్ స్పోర్ట్స్ ఎంపికల్లో ప్రతిభ చూపిన దుర్గాప్రసాద్, కడప జిల్లా గండికోటలో నెలరోజుల పాటు జరిగిన శిక్షణను విజయవంతంగా పూర్తి చేశాడు. తదుపరి దశలో లడఖ్‌లో జరిగే ప్రత్యేక ట్రైనింగ్‌కు ఎంపిక కావడం విశేషం. ఈ సందర్భంగా ఎంఈవోలు సత్యనారాయణ, కృష్ణప్రసాద్‌తో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్థులు విద్యార్థిని అభినందిస్తూ, అతడు మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం నాగభూషణం పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మహిళలు అందరూ అక్షరాసులు కావాలి




**మునగపాక, ఫిబ్రవరి 19, మేజర్‌న్యూస్:** మండల కేంద్రమైన మునగపాక పంచాయితీ లో అక్షరాంధ్రా వయట్లజన విద్య అందిస్తున్న సెంటర్ లను జిల్లా విద్యశాఖ అదనపు డైరెక్టర్ డి.చిన్ని కృష్ణ సందర్శించారు, ముఖ్యంగా చదువు కోలేని పెద్దలు ఈ అక్షరాంధ్ర కార్యక్రమన్ని సద్వినియోగం చేసుకోవాలని చదవడం రాయడం సంతకాలు నేర్పుకోవడం ద్వారా మంచి జ్ఞానం వస్తుందని సంఘాల నిర్వహణ లోపాలు గుర్తించవచ్చుని లెక్కలు సరిచుసుకో వచ్చని, దూర ప్రయాణాలు చేసేటప్పుడు బస్సు పేర్లు, చదువుకుని వెళ్ళ వచ్చని, శిక్షణ సభ్యులకు తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో ఏపిఎం బాలరాజు , సీసీ వేణు, శిక్షణ టీచర్ కస్పా రమాదేవి పాల్గొన్నారు.

# నిస్సాన్ ఆల్ న్యూ గ్రావైట్ ప్రారంభం




**విశాఖపట్నం,** నిస్సాన్ మోటార్ ఇండియా ఈరోజు ఆల్ న్యూ నిస్సాన్ గ్రావైట్‌ను రూ. 5.65 లక్షల ప్రారంభ ధరకు విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది. బోల్డ్ మరియు గేమ్ ఛేంజ్ చేసే 7 సీటర్ ఎం పీవీ గ్రావైట్ నిస్సాన్ యొక్క భారతదేశ ప్రయాణంలో కొత్త అధ్యాయానికి నాంది పలికిందని నిస్సాన్ మోటార్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ సౌరభ్ వత్సా అన్నారు. భారతదేశం నుండి ప్రేరణ పొంది, మేడ్ ఇన్ ఇండియా, మేడ్ ఫర్ ఇండియా గ్రావైట్ అనేది నిస్సాన్ మోటార్ ఇండియా యొక్క పునరుద్ధరించబడిన ఉత్పత్తి కింద విడుదల చేయబడిన మొదటి ఉత్పత్తి అని చెప్పారు. భారతదేశంలో కంపెనీ యొక్క పటిష్టమైన నిబద్ధత మరియు ఉనికిని నొక్కి చెబుతుందన్నారు. గ్రావైట్ అనే పేరు 1.4 బిలియన్ భారతీయుల నుండి ప్రేరణ పొందింది మరియు దేశం యొక్క వైవిధ్యాన్ని రూపొందించే 19,000 మాతృభాషలు మరియు ఆచారాల నుండి ప్రేరణ పొందిందన్నారు. గ్రావైట్ భారతీయ కుటుంబాల అభివృద్ధి చెందుతున్న ఆకాంక్షలను తీర్చడానికి ఉద్దేశపూర్వకంగా నిర్మించబడిందని, ఇది స్థలం, బహుముఖ ప్రజ్ఞ, సౌలభ్యం మరియు రోజువారీ ప్రాక్టికాలిటీని కమాండింగ్ రహదారి ఉనికితో మిళితం చేస్తుందన్నారు. థియరీ సబ్బాగ్, డివిజనల్ వైస్ ప్రెసిడెంట్ మరియు ప్రెసిడెంట్,మిడిల్ ఈస్ట్, కేవస్ ఏ, సీ ఐ ఎస్ మరియు భారతదేశం నిస్సాన్ మరియు ఇన్ఫినిటీ, "నిస్సాన్ యొక్క గ్లోబల్ ఆశయాలకు భారతదేశం కేంద్రంగా ఉందన్నారు. గత ఏడాది కార్యకలాపాలను బలోపేతం చేయడం, నెట్‌వర్క్‌ను విస్తరించడం మరియు ఉత్పత్తి ప్రమాదకర చర్యలను ప్రారంభించడం వంటివి ఈ మార్కెట్‌పై మా దీర్ఘకాలిక నిబద్ధతను ప్రదర్శిస్తాయి. ఆల్ న్యూ నిస్సాన్ ఉత్పత్తి ప్రారంభ దశ కేవలం ప్రారంభ దశ కాదు. భారతదేశంలోని నిస్సాన్ చెన్నైలోని కూటమి భాగస్వామ్య సదుపాయంలో స్థానిక తయారీ మరియు భవిష్యత్ సిద్ధమైన ఉత్పత్తి రోడ్‌మ్యాప్‌తో తాము ముందుకు వస్తున్నట్లు చెప్పారు.

## ఈనారి సిఆర్పి లు ద్వారా సర్వే



**అచ్యుతాపురం, ఫిబ్రవరి 19, మేజర్‌న్యూస్:** ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఆదేశాలు తో సెర్ప్ సంస్థ విజవాడ కేంద్ర కార్యాలయం నుండి వచ్చిన ఆదేశాలు మేరకు అచ్యుతాపురం మండలం లో ఉన్న స్వయం సహాయక సంఘాల లో ఉన్న సభ్యులు కి ప్రస్తుతం ఉన్న జీవనోపాధి లు కోసం మరియు ఇంకా మెరుగైన జీవనోపాధి లు కోసం కావలసిన సెర్ప్ సంస్థ ద్వారా రుణాలు ఏమి కావాలి మరియు నైపుణ్యాలు ఏమి కావాలో ఇంటి ఇంటికి వెళ్లి సబ్యులు యొక్క వివరాలు తెలుసుకొని ఈ నారి సిఆర్పి లు లిద్వారా సర్వే చెయ్యటం జరుగుతుంది అచ్యుతాపురం మండలం లో 179. మంది ఈ నారి సి ఆర్ పి లు తో 1803. స్వయం సహాయక సంఘాలు 18805 మహిళ సభ్యులు కి సర్వే చెయ్యటం జరుగుతుంది ఈ రోజు ఉదయం అచ్యుతాపురం మండలం లో కొండ కర్ల గ్రామ పంచాయతీ గ్రామ సంఘం లో ఎస్ హెచ్ జి సబ్యులు యొక్క ప్రస్తుత జీవనోపాధి లు ఏమి ఉన్నాయి ఇంకా మెరుగైన జీవనోపాధి లు ఎంపిక చేసుకునే వాటికి సర్వే. కొత్త గా వచ్చిన లింక్ యాప్ లో ఈ, నారి సిఆర్ పి లు తో సర్వే చెయ్యటం జరుగుతుంది అటెండ్. ఏ పి ఎం. ఎస్ శ్రీనివాసరావు సీసీ సరోజినీ ఈ నారి. లు విఓఏ మెర్సీ హాజరు కావడం జరిగింది.

## ఆంధ్రప్రదేశ్ రగ్బీ ఖోలో ఇండియా జట్టుకి కోచ్ గా అచ్యుతాపురం చెందిన వెంకట్ ఎంపిక



**అచ్యుతాపురం, ఫిబ్రవరి 19 , మేజర్‌న్యూస్:** ఈనెల 20 నుంచి 23 వరకు జోహార్ లాల్ నెహ్రూ స్టేడియం, చెన్నై, తమిళనాడు లో జరగబోతున్న సౌత్ జోన్ ఖోలో ఇండియా నేషనల్ కి అండర్ 15 జట్టుకి కోచ్ గా అనకాపల్లి సిద్ధార్థ ఈ టెక్నో స్కూల్లో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న వెంకట్ ఎంపికైనట్లు ఆంధ్రప్రదేశ్ సెక్రటరీ బి రామాంజనేయులు తెలియజేశారని అనకాపల్లి జిల్లా సెక్రెటరీ కూండ్రపు నాగ వెంకట రావు ఒక ప్రకటనలో తెలిపారు. అనకాపల్లి జిల్లా రగ్బీ అసోసియేషన్ సభ్యులు వెంకట్ ను మంచి ఫలితాలను తీసుకురావాలని అభినందనలు తెలియజేశారు.

## మత్స్యకారులకు బోటింజన్ యొక్క లోపాల గురించి అవగాహన సదస్సు



**అచ్యుతాపురం, ఫిబ్రవరి 19, మేజర్‌న్యూస్:** అనకాపల్లి పూడిమడక, ప్రాంతంలో వున్న మత్స్యకారులకు " బోట్ ఇంజన్ యొక్క లోపాలు సరిదిద్దడం" అనే అంశం మీద ఒక్క రోజు పాటు అవగాహన సదస్సు నిర్వహించబడింది. మత్స్యశాఖ ఆధ్వర్యంలో 19-02-26 నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జి.విజయ,ఎఫ్ డి. ఓ. ,అనకాపల్లి, మత్స్యశాఖ మరియు మత్స్యశాఖ అధికారి రవితేజ, ఎఫ్ డి ఓ , అనకాపల్లి పాల్గొన్నారు. పి.ఎమ్. ఎమ్.ఎస్.వై పథకం క్రింద ఎన్. ఎఫ్. డి. బి. నిధులు తో మత్స్యశాఖ, అనకాపల్లి, ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ తో సంయుక్త గా నిర్వహించబడిన కార్యక్రమం లో సిఫాంట్స్ చెందిన టెక్నికల్ అధికారులు టి.హరనాథ్, అర్జున్ ఉ ప్రసాద్ అధికారులు ఇంజన్ మీద సాంకేతిక శిక్షణను మత్స్యకారులకు అవగాహన ఇచ్చారు.

